ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు
జిల్లా వార్తలు
సోమవారం 28 జూలై 2025





కరేడు వెళ్లే జాతీయ రహదారి వద్ద గస్తీ నిర్వహిస్తున్న పోలీసులు

కరేడులో పోలీసు పహారా

- నెలాఖరు వరకు పోలీసు యాక్ట్
- బయటవారికి అనుమతి నిరాకరణ
- సభలు, సమావేశాలు రద్దు

ఉలవపాడు, జూలై 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కరేడు గ్రామంతో పాటు, శివారు గ్రామాలు పోలీసు పహారాలో ఉన్నాయి. ఆదివారం నుంచి కందుకూరు సబ్ డివిజన్ పరిధిలో 30 పోలీస్ యాక్ట్ అమలుల్లోకి వస్తుందని డీఎస్పీ బాలసుబ్రహ్మణ్యం తెలిపారు. బయట వ్యక్తులకు కరేడు గ్రామంలోకి ప్రవేశం లేదన్నారు. సభలు, సమావేశాలు నిర్వహించేందుకు అనుమతులు లేవని తేల్చి చెప్పారు. ఈ క్రమంలో ఉలవపాడు పోలీసు స్టేషన్‌కు ఆదివారం ఉదయాన్నే సుమారు 300 మంది పోలీసులు వచ్చారు. కరేడు గ్రామానికి వెళ్లే అన్ని మార్గాలను ప్రత్యేక దళాలతో గస్తీ ఏర్పాటు చేశారు. అనుమానితులను తనిఖీ చేసి గ్రామాల్లోకి అనుమతిస్తున్నారు.

నిర్బంధంతో భూములు లాక్కోలేరు..

మా సమ్మతి లేకుండా ఎంతమంది పోలీసులైనా మోహరించినా ఎకరా భూమిని కూడా ప్రభుత్వం తీసుకోలేదని కరేడు రైతులు ఘంటాపథంగా చెప్తున్నారు. అమాయకులపై అక్రమ కేసులు బనాయించి భయభ్రాంతులకు గురి చేసి గ్రామాలను తరలించాలని చూస్తున్నారని వారు పేర్కొన్నారు. ఇందులో భాగంగారు పోలీస్ యాక్ట్ అమలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వెంకటాచలం, (ఆంధ్రజ్యోతి): ఉలవపాడు మండలం కరేడు రైతులకు సంఘీభావం తెలిపేందుకు వెళుతున్న బీసీవై పార్టీ అధినేత బోడే రామచంద్ర యాదవ్‌ను వెంకటాచలం సమీపంలోని టోల్‌ప్లాజా వద్ద ఆదివారం పోలీసులు అడ్డుకున్నారు. అక్కడికి వెళ్లేందుకు అనుమతి లేదని నెల్లూరు రూరల్ డీఎస్పీ జీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసులు ఆయన వాహనాన్ని చుట్టుముట్టారు.దీంతో కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది. ఇద్దరి మధ్య వాదోపవాదాలు జరిగాయి. ఒకానొక దశలో పోలీసుల తీరుపై ఆయన మండిపడ్డారు. పోలీసులు ససేమిరా అనడంతో చివరకు అక్కడి నుంచి వెనుతిరిగారు. ఈ సందర్భంగా రామచంద్ర యాదవ్ మీడియాతో మాట్లాడుతూ కరేడు రైతుల మనోభావాలకు వ్యతిరేకంగా ప్రభుత్వం 8300 ఎకరాల భూములను బలవంతంగా తీసుకోవాలని ప్రయత్నిస్తున్నదన్నారు. రైతులతో మాట్లాడేందుకు వెళ్తున్న తనను అడ్డుకోవడం దారుణమన్నారు. కచ్చితంగా పోలీసుల అనుమతితో మళ్లీ కరేడుకు వెళ్తానన్నారు. అక్కడి రైతులకు న్యాయం జరిగేంతవరకు పోరాటానికి తాను సిద్ధంగా ఉన్నానన్నారు.

వెంకటాచలం టోల్‌ప్లాజా వద్ద ఉద్రిక్తత
కరేడు రైతులకు మద్దతుగా రామచంద్ర యాదవ్
గ్రామానికి వెళ్లేందుకు అనుమతి లేదన్న పోలీసులు



బీసీవై పార్టీ అధినేత రామచంద్ర యాదవ్ వాహనాన్ని అడ్డుకున్న పోలీసులు

సోమశిలకు పెరుగుతున్న వరద

- 12,113 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

అనంతసాగరం జూలై 27 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో పెరుగుతోంది. శనివారం 10,151 క్యూసెక్కులు రాగా ఆదివారానికి 12,113 క్యూసెక్కులుగా నమోదైనట్లు అధికారులు తెలిపారు. పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్‌కు నీటి సరఫరా పెంచడంతో కుందూనది నుంచి సోమశిలకు వరద చేరుతోంది. ప్రస్తుతం డ్యాంలో 29.712 టీఎంసీలు నీరు నిల్వ ఉండగా, ఉత్తర కాలువకు 320, దక్షిణ కాలువకు 400, పెన్నా డెల్టాకు 1,725 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు. వస్తున్న వరదతో నీటిమట్టం పెరుగుతుండగా అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కండలేరులో...

రాపూరు, (ఆంధ్రజ్యోతి) : కండలేరు పూర్తిస్థాయి నీటి మట్టం 68 టీఎంసీలు కాగా, ప్రస్తుత నీటిమట్టం 27.200 టీఎంసీలుగా ఉందని డ్యామ్ ఏఈ కట్టా తిరుమలయ్య తెలిపారు. ఇన్‌ఫ్లో లేకపోగా, అవుట్‌ఫ్లో హెడ్ రెగ్యులేటర్ నుంచి 2210 క్యూసెక్కులు, లోలెవల్ స్లూయిస్ నుంచి 100 క్యూసెక్కులు ఉందని ఆయన తెలిపారు.

బాబూ... చూసుకుని తాగు !

- కాలం చెల్లిన బీర్లు, బ్రీజర్లు విక్రయిస్తే 14405కి ఫిర్యాదు చేయండి
- జిల్లాలో స్టేట్ ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ తనిఖీలు
- ఇటీవల గుంటూరులో ఎక్స్‌పైర్ డేట్ సరుకు విక్రయం

నెల్లూరు(క్రైం), జూలై 27(ఆంధ్రజ్యోతి): యువత బీర్లు ఇష్టంగా తాగుతుంటారు...అయితే బీరు తయారు చేసిన తేదీ నుంచి ఆరునెలల వరకు మాత్రమే ఎక్స్‌పైర్ డేట్ ఉంటుంది. ఇక బ్రీజర్‌కు ఏడాదికాలం ఎక్స్‌పైర్ డేట్ ఉంటుంది. మందు బాబులూ... లిక్కర్ విషయం పక్కన పడితే బీర్లు, బ్రీజర్ల విషయంలో మాత్రం మీరు జాగ్రత్తగా ఉండాల్సిందే..! ఎక్స్‌పైర్ డేట్ తరువాత వాటిని తాగడం, ఆరోగ్యానికి హానికరమని ఎక్సైజ్ అధికారులు చెప్తున్నారు. ఈ క్రమంలో ఇటీవల గుంటూరు జిల్లాలోని మద్యం దుకాణాల్లో కాలం చెల్లిన బీర్లను ఎక్సైజ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా బార్లు, మద్యం దుకాణాల్లో కాలం చెల్లిన బీర్లు, బ్రీజర్లపై ఎక్సైజ్ శాఖ తనిఖీలు చేపట్టింది. స్టేట్ టాస్క్‌ఫోర్స్ అధికారులతో పాటు జిల్లా అధికారులు ప్రత్యేక బృందంగా ఏర్పడి జిల్లాలోని బార్లు, మద్యం దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేస్తున్నారు.



వింజమూరు ప్రాంతంలోని మద్యం దుకాణంలో తనిఖీలు చేస్తున్న ఎక్సైజ్ అధికారులు(ఫైల్)

డేట్ గమనించాలి..

బార్లు, మద్యం దుకాణాల్లో బీర్లు, బ్రీజర్లు కొనుగోలు చేస్తున్న మందుబాబులు వాటిపై ఉన్న ఎక్స్‌పైర్ డేట్‌ను పరిశీలించాలి. కాలం చెల్లినవాటిని ఇస్తే వెంటనే 14405 నంబరుకు ఫిర్యాదు చేస్తే ఎక్సైజ్ అధికారులు చర్యలు తీసుకుంటారు.

భారీగా చలానాలు



కాలం చెల్లిన బీర్లు, బ్రీజర్లు విక్రయిస్తే చర్యలు తీసుకుంటాం. వాటిపై ఫిర్యాదులు అందితే విక్రయిస్తున్న మద్యం దుకాణాలు, బార్లపై రూ.2 లక్షలకుపైగా అపరాధ రుసుము విధిస్తాం. కాలం చెల్లిన బీర్లు, బ్రీజర్లు ఉంటే వాటిని మద్యం డిపోకు అందిస్తే వాటి స్థానంలో వేరే వాటిని అందిస్తాం.

-శ్రీనివాసనాయుడు, ఎక్సైజ్ సూపరింటెండెంట్

దోషుల్ని తేల్చారు..

దండనే మిగిలింది !

- జిల్లాలో ఇసుక అక్రమ తవ్వకాలపై విచారణ పూర్తి
- ప్రభుత్వానికి మైనింగ్‌శాఖ నివేదిక
- డిమాండ్ నోటీసుల జారీ, ఆపై కోర్టుకు కాంట్రాక్టర్లు
- సర్కార్ చర్యలపై సర్వత్రా ఉత్కంఠ

నెల్లూరు, జూలై 27 (ఆంధ్రజ్యోతి): పెన్నానది ఒడ్డునే జిల్లా ఉన్నప్పటికీ వైసీపీ ప్రభుత్వంలో ప్రజలకు ఇసుక దొరకడం గగనంగా మారింది. అంతకుముందు టీడీపీ ప్రభుత్వంలో ఉచితంగా దొరికే ఇసుకను, వైసీపీ ప్రభుత్వం విక్రయించేది. నాడు ట్రాక్టర్ ఇసుక రూ.1500 వస్తే వైసీపీ ప్రభుత్వంలో రూ.5 వేలకు పెరిగింది. కానీ జిల్లా నుంచి మాత్రం తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు యథేచ్ఛగా ఇసుక తరలివెళ్లింది. నాడు ఒక్క అధికారి కూడా ఆ లారీలను పట్టించుకున్న దాఖలాలు లేవు. గతేడాది ప్రభుత్వం మారడంతో ఇసుక అక్రమాల డొంక కదిలింది.

వెలుగులోకి అక్రమాలు

పెన్నాలో మొత్తం 15 ప్రాంతాల్లో మైనింగ్ అధికారులు దాదాపు నెలపాటు విచారణ జరిపి గుంతల కొలతలు తీసి అక్రమాలు నిగ్గు తేల్చారు. అదే సమయంలో ఏసీబీ అధికారులు కూడా రంగంలోకి విచారణ ప్రారంభించారు. ఈ రెండు విభాగాలు వేర్వేరుగా విచారణ జరిపి ప్రభుత్వానికి నివేదికలు అందజేశాయి. మొత్తం ఈ 15 ప్రాంతాల్లో 8.76 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక తవ్వకాలకు అనుమతులిస్తే, ఏకంగా 28.13 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుకను తవ్వినట్లు నిర్ధారించారు. ఇందుకు సంబంధించి ఇటీవల ఆయా కాంట్రాక్టర్లకు మైనింగ్ అధికారులు నోటీసులు ఇవ్వగా, వీటిపై కాంట్రాక్టర్లు కోర్టును ఆశ్రయించారు. ఇప్పుడు ప్రభుత్వం అక్రమార్కులపై తదుపరి ఎలాంటి చర్యలు తీసుకుంటుందన్నది ఆసక్తిగా మారింది.

2022 నుంచి రీచ్‌ల వారీగా ఇసుక అక్రమాల వివరాలు

ప్రాంతం	అనుమతిచ్చింది (మెట్రిక్ టన్నులు)	తవ్వింది (మెట్రిక్ టన్నులు)	అక్రమ తవ్వకం (రూ.కోట్లలో)	పెనాల్టీ
వేగూరు	---	1,86,187	1,86,187	37.23
కోడూరుపాడు	---	74,395	74,395	14.87
లేగుంటపాడు	---	1,13,816	1,13,816	22.76
ముదివర్తి-1	37,637	1,52,969	1,15,333	23.06
ముదివర్తి-2	72,000	3,50,376	2,78,376	55.67
ముదవర్తి-3	72,600	79,853	7253	1.45
ముదవర్తి-4	70,350	1,36,580	66,230	13.24
పీకేపాడు	73,755	1,25,500	51,745	10.34
పల్లిపాడు-1	72,150	3,07,154	2,35,004	47
పల్లిపాడు-2	74,100	1,32,938	58,838	11.76
వెంకటేశ్వరపురం	--	25,786	25,786	5.15
విరువూరు	73,350	2,58,350	1,85,000	37
గొల్లకందుకూరు	2,17,200	2,51,916	34,716	6.94
మినగల్లు	73,350	3,03,483	2,30,133	46.02
సూరాయపాలెం	40,500	3,14,000	2,73,500	54.70
మొత్తం	8.76.992	28.13.303	19.36.312	387.26

డిమాండ్ నోటీసుల జారీ

విరువూరు, ముదివర్తి, పల్లిపాడు, మినగల్లు ప్రాంతాల్లో విచ్చలవిడిగా ఇసుక తవ్వకాలు జరిపినట్లు నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. గతేడాది సెప్టెంబరులో ప్రభుత్వానికి అందజేసిన నివేదిక ప్రకారం పై నాలుగు ప్రాంతాల్లో సగం అక్రమాలు జరిగాయి. ఇక వేగూరు, కోడూరుపాడు, లేగుంటపాడు, వెంకటేశ్వరపురం ప్రాంతాల్లో రీచ్‌లు లేకపోయినా అక్రమార్కులు ఇక్కడ తవ్వకాలు జరిపారు. గత ప్రభుత్వంలో రెండు సంస్థలకు ఇసుక తవ్వకాలను అప్పగించారు. ఈ రెండింటికి మైనింగ్ అధికారులు డిమాండ్ నోటీసులు అందించారు. అనుమతులకు మించి తవ్వకాలు జరిపినందుకు పెనాల్టీలు చెల్లించాలని ఆ నోటీసుల్లో పేర్కొన్నారు. అయితే ఈ నోటీసులపై సదరు కాంట్రాక్టర్లు హైకోర్టును ఆశ్రయించారు. ఇటీవల ఈ పిటిషన్లకు సంబంధించి హైకోర్టు నుంచి స్టే ఉత్తర్వులు అందగా.. వీటిపై మైనింగ్ అధికారులు కౌంటర్ దాఖలు చేయాల్సి ఉంది.



మొదట ఇంకెంతో..!

జరిగిన విచారణ అంతా 2022, 2023లో జరిపిన తవ్వకాలకు సంబంధించిందే. 2021 వరకు జరిగిన తవ్వకాలన్నీ అప్పుడు వచ్చిన భారీ వరదతో కనుమరుగయ్యాయి. ఇందుకు సంబంధించి శాటిలైట్ ఇమేజస్ ద్వారా విచారణ చేసేందుకు ప్రభుత్వం గతేడాది ఆదేశాలు ఇచ్చింది. ఈ మేరకు శాటిలైట్ ఇమేజస్ సాయంతో మైనింగ్ అధికారులు లోతుగా విచారణ జరిపారు. ఇక్కడ కూడా భారీగా అక్రమాలు బయటపడినట్లు సమాచారం. ఈ సమాచారాన్ని కూడా ఇటీవల మైనింగ్ అధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి అందజేశారు.

నోటీసులు ఇచ్చాం...


ఇసుక అక్రమ తవ్వకాలపై విచారణ జరిపాం. అనధికార తవ్వకాలను గుర్తించి కాంట్రాక్టర్లకు డిమాండ్ నోటీసులు ఇచ్చాం. అయితే వారు హైకోర్టును ఆశ్రయించి స్టే తెచ్చుకున్నారు. వీటికి కౌంటర్ వేస్తున్నాం.

- శ్రీనివాసరావు, మైనింగ్ డీడీ

- రోజూ 9 గంటలకు కార్యాలయంలో ఉండాల్సిందే..
- విధుల నిర్వహణపై ప్రత్యేక పర్యవేక్షణ

ఎంఈవోలకూ

హాజరే!



నెల్లూరు(విద్య), జూలై 27 (ఆంధ్రజ్యోతి): ఇప్పటి వరకు ఇష్టానుసారంగా విధులు నిర్వహిస్తున్న ఎంఈవోలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. వీరిపై ఇటీవల ఫిర్యాదులు, ఆరోపణలు అధికమవుతున్న నేపథ్యంలో వారికి చెక్ పెట్టేందుకు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ రంగంలోకి దిగారు. ఇప్పటివరకు తమకు నచ్చిన సమయంలో కార్యాలయానికి వెళుతున్న ఎంఈవోలు, ఇకపై ప్రతిరోజూ ఉదయం 9 గంటలకే కార్యాలయానికి హాజరు కావాలని ఉత్తర్వులు జారీ చేశారు. వచ్చిన వెంటనే ఆన్‌లైన్‌లో ఫేస్ రికగ్నేషన్ హాజరు వేసుకోవడంతో పాటు నిత్యం ఓ పాఠశాలను తనిఖీ చేసి నివేదికలు అందచేయాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

జిల్లాలోని 38 మండలాల్లో ఎంఈవో-1, ఎంఈవో-2లు పనిచేస్తున్నారు. వీరిలో ఎంఈవో-2లు 37 మండలాల్లో పనిచేస్తుండగా, ఎంఈవో-1లు మాత్రం 18 మండలాల్లో ఉండగా 20 మండలాల్లో ఇన్‌చార్జ్‌లే కొనసాగుతున్నారు. వీరంతా కూడా నామమాత్రంగా విధులు నిర్వహిస్తున్నారనే విమర్శలు విద్యాశాఖలో వినిపిస్తున్నాయి. మండలానికి ఇద్దరు ఉండడంతో వారిలో ఆధిపత్య పోరు ప్రారంభమై విద్యావ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నారని ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొంతమంది ఎంఈవోలు తాము పనిచేసే మండలాల్లో కాకుండా ఎక్కడో నగరాల్లో దూరంగా నివాసం ఉండడంతో వీరు నిత్యం ఆయా మండలాలకు వచ్చే పరిస్థితి కూడా లేదు. ఎప్పుడో ఒకసారి కార్యాలయానికి రావడం, మరికొంత మంది ఎంఆర్‌సీ కేంద్రాలకు వెళ్లకుండా పాఠశాలల తనిఖీ పేరుతో కాలక్షేపం చేయడం తదితర వ్యవహారాలన్నీ కూడా కమిషనర్ దృష్టికి వెళ్లడంతో వీరిపై ప్రత్యేక దృష్టి సారించారు.

జిల్లా విద్యాశాఖకు ఆదేశాలు.

ప్రతిరోజూ ఉపాధ్యాయుల హాజరు నివేదికలను పంపించిన తరహాలోనే ఎంఈవోలు, ఇతర సిబ్బంది హాజరును కూడా నిత్యం తనకు నివేదికలను అందచేయాలని కమిషనర్ తెలిపారు. నామమాత్రపు పాఠశాల తనిఖీలు కాకుండా ప్రతిరోజూ ఒక పాఠశాలకు హాజరై పాఠశాల పనితీరు, వసతులు, ఇతర అంశాలన్నింటినీ పరిశీలించి వివరాలు తనకు అందచేయాలన్నారు. ఇకపోతే ఎంఈవో పర్యటనలకు సంబంధించి అవసరమైతే జీపీఎస్ విధానం అమలు చేయాలని కమిషనర్ స్పష్టమైన ఆదేశాలిచ్చినట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు.

31న మాజీ సీఎం జగన్ రాక 8లో..

- ఎరువులు, పురుగు మందుల పిచికారికి డ్రోన్లు
- రైతులకు ఖర్చు తక్కువ, సమయం ఆదా
- జిల్లాకు 41 కేటాయించగా, 18 పంపిణీ
- సరఫరాకు సిద్ధంగా మరో 10
- మిగతా వాటికి దరఖాస్తుల ఆహ్వానం
- 9 రైతు బృందాల ఖాతాల్లో సబ్సిడీ నగదు జమ



నెల్లూరు రూరల్ మండలంలో రైతు బృందానికి డ్రోన్ అందజేస్తున్న డీఏవో సత్యవాణి తదితరులు (ఫైల్)

సాగులో సాంకేతికం

నెల్లూరు(వ్యవసాయం), జూలై 27(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగానికి సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోంది. ఈ క్రమంలో ఎరువులు, పురుగు మందుల పిచికారికి రైతులకు సబ్సిడీపై డ్రోన్లు అందచేస్తున్నది. దీంతో సాగుఖర్చులు తగ్గడంతో పాటు సమయం కూడా ఆదా అవుతుంది. ఈ డ్రోన్లను ప్రభుత్వం రాష్ట్రీయ కృషి వికాస్ యోజన పథకంలో భాగంగా రైతు బృందాలకు 80శాతం రాయితీపై అందిస్తోంది.

నిబంధనల మార్పు

డ్రోన్ కోసం దరఖాస్తు చేసుకునే రైతుబృందాలు యూనిట్ ధర మొత్తంలో 50శాతం నగదు డిపాజిట్ చేయాలనేది నిబంధన. ఈలెక్కన దాదాపుగా రూ.5లక్షల వరకు రైతు బృందాలు బ్యాంకు ఖాతాలో జమ చేశాయి. మిగిలిన 50శాతం మొత్తం బ్యాంకు రుణంగా ఇస్తుంది. ఆ తరువాత 80శాతం రాయితీని ప్రభుత్వం విడుదల చేస్తుంది. ఈ నిబంధనల్లో కొన్ని మార్పులు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. యూనిట్ ధరలో 20శాతం అంటే... రైతు బృందం వాటా దాదాపు రూ.2లక్షలు మాత్రమే చెల్లించేలా మార్పు చేసింది. మిగిలిన 80శాతం బ్యాంకు రుణం ఇస్తుంది. అనంతరం 80శాతం సబ్సిడీ నగదును రైతు బృందం ఖాతాలో ప్రభుత్వం జమ చేస్తుంది. అందులో బ్యాంకు రూ.5.8లక్షలు జమ చేసుకుంటుంది. మిగిలిన మొత్తాన్ని రైతు బృందం డ్రా చేసుకుంటుంది. ఆ నగదు మొత్తాన్ని మూడేళ్లలోగా అసలు, వడ్డీతో సహా చెల్లించాల్సి ఉంటుంది.

41 డ్రోన్ల కేటాయింపు

జిల్లాకు 41 డ్రోన్ల యూనిట్లు కేటాయించారు. ఒక్కో డ్రోన్ ఖరీదు సుమారు రూ.10 లక్షలు. ఇప్పటికే జిల్లాలో 28 రైతు బృందాలు డ్రోన్ల కోసం దరఖాస్తు చేసుకున్నాయి. బ్యాంకుకు 50శాతం నగదు కూడా డిపాజిట్ చేశాయి. వీటిలో 18 బృందాలకు పంపిణీ కూడా జరిగింది. మరో 10 డ్రోన్లు పంపిణీకి సిద్ధమయ్యాయి. మరో 6 రైతు బృందాలు దరఖాస్తు చేసుకుని ఉన్నారు. మొత్తం మీద దాదాపుగా 28 యూనిట్లు పంపిణీ చేసినా, ఇంకా 13 యూనిట్లు అందుబాటులో ఉన్నాయి. ఆసక్తి కలిగిన రైతులు బృందాలుగా ఏర్పడి దరఖాస్తులు చేసుకోవచ్చు. గ్రూపులో ఒకరు డ్రోన్ పైలట్‌గా వ్యవహరిస్తారు. ఇంటర్ చదివి, పాస్‌పోర్టు కలిగి ఉండాలి. వారికి శిక్షణ ఇచ్చిన అనంతరం డ్రోన్ అందజేస్తారు.

రైతులు దరఖాస్తు చేసుకోవాలి

అధునాతన పద్ధతులతో వ్యవసాయాన్ని సులభతరం చేయడంలో డ్రోన్ల పాత్ర ఎంతో కీలకం. జిల్లాకు 41 డ్రోన్ల యూనిట్లు కేటాయించారు. వారిలో 18 మందికి పంపిణీ జరగ్గా 9 రైతు బృందాల ఖాతాల్లో సబ్సిడీ నగదు జమైంది. ఇంకా 10 గ్రూపులకు డ్రోన్లను, రెండు మూడు వారాల్లో అందచేయనున్నాం. ఆసక్తి కలిగిన రైతులు బృందాలుగా ఏర్పడి దరఖాస్తు చేసుకోవచ్చు.

- పీ.సత్యవాణి, జిల్లా వ్యవసాయాధికారి

డ్రోన్‌తో ఉపయోగాలివే..

ఎకరా పొలానికి ఎరువులు, పురుగు మందుల పిచికారి చేయాలంటే సాధారణంగా మూడు, నాలుగు గంటలు పడుతుంది. తక్కువలో తక్కువగా రూ.500ల వరకు ఖర్చవుతోంది. డ్రోన్లతో ఎన్ని ఎకరాలకైనా నిముషాల్లో ఎరువులు, పురుగు మందులు చల్లుకోవచ్చు. ఎకరా పొలంలో పిచికారికి సుమారు 8 నుంచి 10 నిముషాలు సరిపోతుందని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. రూ.300ల నుంచి రూ.350వరకు ఖర్చవుతుందని అంచనా. ఈపద్ధతిలో మందులు పిచికారి చేయడం వల్ల మందులు 25శాతం వరకు వృథా కాకుండా ఉంటాయంటున్నారు. దీంతో రైతుకు మందులు, కూలీల ఖర్చులు తగ్గుతాయి. అంతేకాక పంటలు ఏదశలో ఉన్నా పురుగు మందులు పిచికారి చేసుకోవచ్చు. దీంతో పంట దిగుబడులు పెరుగుతాయి. రోజుకు 25 నుంచి 30 ఎకరాల వరకు మందుల పిచికారి చేసుకోవడం వల్ల పైలట్లకు కూడా ఉపాధి కూడా లభించే అవకాశం ఉంది.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	134
స్కిన్ చికెన్	240
స్కిన్‌లెస్	264

కోడిగుడ్ల ధర (100): 475

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9435
వెండి కిలో ధర	రూ. 116400
వెండి ఒక గ్రాము	రూ.119.40

నేడు పీఎఫ్ అవగాహన సదస్సు

నెల్లూరు(వెంకటేశ్వరపురం), జూలై 27 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగుల భవిష్య నిధి(పీఎఫ్)కి సంబంధించిన సమస్యల పరిష్కారం కోసం సోమవారం తడ, మంబట్టు ప్రాంతాల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు జిల్లా పీఎఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి డీ కృష్ణారావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తడ, మంబట్టు ప్రాంతాల్లోని అపాచీ ఫుట్వేర్ పరిశ్రమ వద్ద నిధి ఆప్కే నిఖత్-2 కార్యక్రమంలో భాగంగా అవగాహన కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. సర్వీసు బదిలీ, నిధి ఉపసంహరణ, అకౌంట్స్... ఇలాంటి అన్నీ సమస్యల పరిష్కారానికి ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

మూలాపేట బాలికోన్నత పాఠశాలలో అభివృద్ధి పనులు

నెల్లూరు(విద్య), జూలై 27 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని మూలాపేట ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో అభివృద్ధి పనులకు శ్రీదేవిరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన నగరపాలక సంస్థ కమిషనర్ నందన్ మాట్లాడుతూ మున్సిపల్ మంత్రి పొంగూరు నారాయణ సహకారంతో డీఎస్ఆర్ గ్రూప్ ఈ పనులకు శ్రీకారం చుట్టిందని చెప్పారు. పాఠశాలను అత్యాధునికంగా తీర్చిదిద్ది పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించేలా సిద్ధం చేస్తారన్నారు. వచ్చే ఏడాది నాటికి పనులన్నీ పూర్తి చేసి అందిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎస్ఆర్ గ్రూప్ చైర్మన్ డీ సుధాకర్‌రెడ్డి, డీ ప్రభాకర్‌రెడ్డి, డీ దశరథరామిరెడ్డి, ప్రాజెక్ట్ హెడ్ ఇందుపూరు అనిల్‌కుమార్‌రెడ్డి, డిప్యూటీ ఈవో నాయక్, ఎంఈవో తిరుపాలు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ బీద నియామకంపై హర్షం

నెల్లూరు (హరనాథపురం), జూలై 27 (ఆంధ్రజ్యోతి) : బీసీ సంక్షేమ కమిటీ చైర్మన్‌గా, శాసన మండలి సభా నియమావళి సభ్యుడిగా ఎమ్మెల్సీ బీద రవిచంద్ర ఎంపికైనందుకు భారత్ సేవా ఫౌండేషన్ ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేసింది. రవిచంద్ర ఇంకా ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించింది.

'కృష్ణచైతన్య'లో విజయోత్సవం

నెల్లూరు(విద్య), జూలై 27 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని కృష్ణచైతన్య విద్యాసంస్థలో ఆదివారం విజయోత్సవం నిర్వహించారు. నగరంలోని అనిత హాల్ ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యాసంస్థలకు నాక్ అక్రిడిటేషన్, యూజీసీ అటానమస్ గుర్తింపు దక్కడం గర్వకారణమన్నారు. భవిష్యత్‌లో క్రమశిక్షణ, నాణ్యమైన విద్యా ప్రమాణాలతో మరిన్ని విజయాలు సాధిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఆర్‌వీ కృష్ణారెడ్డి, డైరెక్టర్ రాణా ప్రమోద్‌రెడ్డి, డీన్ రామాంజనేయులు రెడ్డి, డిగ్రీ కళాశాల డీన్ సుధారాణి, పీజీ కళాశాల డీన్ జ్యోతి, ప్రిన్సిపాల్ నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

స్టేడియంలో వైద్య శిబిరం

నెల్లూరు(విద్య), జూలై 27 (ఆంధ్రజ్యోతి) : వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో ఆదివారం వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ కిరణ్ వాకర్స్‌కు వైద్య పరీక్షలు చేసి, ఆరోగ్య సూత్రాలు తెలియజేశారు. వారి సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు స్వర్ణ రమేష్ బాబు, కోశాధికాకారి జీకే గోపీనాథ్, వాకర్స్ నాయకులు రాఘవేంద్రషెట్టి, డీవీ సుబ్బరాజు, డాక్టర్ కృష్ణమూర్తి, డాక్టర్ సత్యనాథ్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమ్మెకు మద్దతు

- కార్మిక, రైతు, దళిత, ప్రజా సంఘాలు

నెల్లూరు (వైద్యం), జూలై 27 (ఆంధ్రజ్యోతి) : నగరంలో మున్సిపల్ కార్మికులు చేస్తున్న సమ్మెకు తమ మద్దతు ఉంటుందని కార్మిక, రైతు, దళిత, ప్రజాసంఘాల నాయకులు వెల్లడించారు ఆదివారం నగరంలోని డాక్టర్ జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి పెంచల నర్సయ్య మాట్లాడుతూ కార్మికుల కడుపు కొట్టే టెండర్ల విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మాజీ డిప్యూటీ మేయర్ మాదాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కరోనా సమయంలోనూ ప్రాణాలు లెక్కచేయక పారిశుధ్య కార్యక్రమాలు పనిచేశారన్నారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్, ఏఐటీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి శంకర్‌కిశోర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జొన్నల గడ్డ వెంకమరాజు మాట్లాడుతూ ఇప్పటికే నగరంలో పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా తయారైందని, వెంటనే కార్మికుల సమస్యలను పరిష్కరించి సమ్మెను ఆపాలని డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి పెంచల నర్సయ్య

ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీరాములు, ఐఎఫ్‌టీయూ నాయకుడు రాంబాబు, రైతు సంఘం నాయకులు కోటిరెడ్డి, షానవాజ్, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రమణ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరేంద్ర, అవాజ్ జిల్లా కార్యదర్శి రషీద్ తదితరులు పాల్గొన్నారు.

పార్కు నిర్మాణానికి శంకుస్థాపన

నెల్లూరు సిటీ, జూలై 27(ఆంధ్రజ్యోతి) : నగరంలోని 5వ డివిజన్ బోడిగాడితోట వద్ద పార్కు నిర్మాణానికి మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్, టీడీపీ నేత తాళ్లపాక అనురాధ ఆదివారం శంకుస్థాపన చేశారు. ఆమె మాట్లాడుతూ టీడీపీ హయాంలో నగర ప్రజల ఆశలకు అనుగుణంగా అభివృద్ధి జరుగుతోందని చెప్పారు. మంత్రి నారాయణ పుట్టిన గడ్డకు న్యాయం చేస్తున్నారని, సీఎస్ఆర్ ఫండ్ రూ.4 కోట్లతో ఈ పార్కును అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు కే గంగాధర్, నాయకులు బాలరెడ్డి, హుమంత్ ప్రసాద్, షేక్. హబీబ్, శశిప్రసన్న, కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న తాళ్లపాక అనురాధ

కోటంరెడ్డి 'అపార్ట్‌మెంటు బాట' ప్రారంభం

నెల్లూరు రూరల్, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : మీరు ఏ సూచనలు చేసినా నేను తప్పక అనుసరిస్తానని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ప్రజలతో అన్నారు. ఆదివారం 19వ డివిజన్‌లో ' అపార్టుమెంట్ల బాట ' కార్యక్రమాన్ని ఆయన మొదలుపెట్టారు. అపార్టుమెంట్ వాసులతో సమావేశం నిర్వహించారు. రూరల్లో 7 వేల కుటుంబాల వరకు అపార్టుమెంట్లలో జీవిస్తున్నారని తెలిపారు. వారి సమస్యలు తెలుసుకునేందుకే ఈ కార్యక్రమమని చెప్పారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోటంరెడ్డి

- 20వ డివిజన్‌లో శంకుస్థాపన

20వ డివిజన్‌లో రూ.23 లక్షలతో పలు అభివృద్ధి పనులకు టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. అనంతరం కార్యాలయంలో రూ.9 లక్షలు సీఎం సహాయ నిధి చెక్కులను బాధిత కుటుంబాలకు అందచేశారు. ఈ కార్యక్రమాల్లో కార్పొరేటర్లు, క్లస్టర్ ఇన్‌చార్జులు, నాయకులు పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబానికి టీడీపీ నేతల సాయం

నెల్లూరు (వైద్యం), జూలై 27 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని 47వ డివిజన్‌కు చెందిన షేక్ నజీమ్ అనే నిరుపేద కుటుంబానికి టీడీపీ పొలిటికల్ టీం బియ్యం బస్తాతోపాటు నగదును అందచేసింది. ఆదివారం జరిగిన ఈ కార్యక్రమంలో టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధర్మవరం సుబ్బారావు, డివిజన్ ఇన్‌చార్జి గణేష్‌కుమార్, మదనంబేటి మునిశేఖర్, నీలకంఠ మునికృష్ణ, భవాని అశోక్, కంచి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆండాళ్ తిరునక్షత్ర వేడుకలు

నెల్లూరు (సాంస్కృతికం), జూలై 27 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని తల్పగిరి రంగనాథస్వామి ఆలయంలో సోమవారం తిరువాడిప్పూరం (ఆడి నెల పుబ్బ నక్షత్రం), ఆండాళ్ అమ్మవారి జన్మనక్షత్ర వేడుకలు ఘనంగా జరుగుతాయని ఈవో ఆళ్ల శ్రీనివాసరెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 7.30గంటలకు శ్రీరంగనాథస్వామి, ఆండాళ్ అమ్మవారికి పేట ఉత్సవం, 8.30గంటలకు తిరుమంజనం, సాయంత్రం 6గంటలకు ప్రాకారోత్సవం, ఎదురుకోలు ఉత్సవం, మాల మార్పు ఉత్సవాలు జరుగుతాయని తెలిపారు.

ఆత్మకూరులో 1,2 తేదీల్లో మెగా జాబ్‌మేళా

చేజర్ల, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ఆత్మకూరులో ఆగస్టు 1, 2 తేదీల్లో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను ఆదివారం చేజర్ల మండలంలోని పెరుమాళ్ళపాడు సమీపంలో ఉన్న వ్యవసాయ క్షేత్రంలో రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణరెడ్డి విడుదల చేశారు. రాష్ట్ర స్కిల్‌డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మంత్రి నారా లోకేష్ సహకారంతో జరిగే జాబ్ మేళాకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

'మన్‌కీ బాత్'తో యువతకు దిశానిర్దేశం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జూలై 27 (ఆంధ్రజ్యోతి): దేశ ప్రధాని నిర్వహిస్తున్న మన్‌కీ బాత్ కార్యక్రమం యువతకు దిశానిర్దేశం చేస్తుందని, దేశ అభివృద్ధిలో ప్రతీ ఒక్కరి పాత్ర కీలకమని బీజేపీ జిల్లా నాయకుడు చిలకా ప్రవీణ్ కుమార్ అన్నారు. రూరల్ పరిధిలోని 19వ డివిజన్‌లో స్థానికులతో కలసి ఆదివారం మన్‌కీబాద్ కార్యక్రమాన్ని వీక్షించారు. ప్రజల్లో చైతన్యాన్ని తీసుకురావడానికి ఈ కార్యక్రమం ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు.



ప్రజలతో కలిసి మన్‌కీ బాత్ చూస్తున్న ప్రవీణ్‌కుమార్

ప్రతీ విద్యార్థి ఉన్నత స్థానానికి చేరుకోవాలి

- ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసరావు
- గౌడ విద్యార్థులకు ప్రతిభ పురస్కార ప్రదానం

నెల్లూరు (హరనాథపురం), జూలై 27 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ తిరగాబత్తిన శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. టౌన్‌హాలులో నెల్లూరు జిల్లా గౌడ కల్లుగీత పారిశ్రామికుల సంఘం, గౌడ సేవా సమితి ట్రస్ట్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కోసూరు రాజశేఖర్‌గౌడ్ ఆధ్వర్యంలో ఆదివారం గౌడ విద్యార్థులకు ప్రతిభ పురస్కారాల ప్రదానోత్సవం జరిగింది. శ్రీనివాసరావు మాట్లాడుతూ గౌడ కులస్తులు వారి పిల్లలను పదో తరగతి తో ఆపకుండా ఉన్నత చదువులు చదివించాలని కోరారు. కల్లుగీత పారిశ్రామికుల సంఘం జిల్లా అధ్యక్షుడు తోట ప్రభాకర్ గౌడ్, కోసూరు రాజశేఖర్ మాట్లాడుతూ గౌడ విద్యార్థుల ఉన్నతి కోసం దివంగత కోసూరు గోవిందయ్య ఆశయ సాధనలో భాగంగా విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను అందిస్తున్నామని చెప్పారు. ఈ ఏడాది 193 మంది విద్యార్థులకు రూ.5వేల నగదు, విద్యా సామగ్రి అందించినట్లు తెలిపారు.



పురస్కారాలు అందుకున్న విద్యార్థినులతో ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసరావు, నాయకులు

ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు నాయుడు రాంప్రసాద్, ఎంపీటీసీ సభ్యుడు రావుల దశరథరామయ్య గౌడ్, జీజీహెచ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ బడుగు కృష్ణమూర్తి, దిశా పోలీస్ స్టేషన్ డీఎస్పీ రామారావు, సీఐ జగన్మోహన్ రావు, డాక్టర్ బీ మాధవులు, డాక్టర్ వెంకటాచలపతిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు మంత్రులుండీ ఏం లాభం?

- పొట్టేపాళెం కలుజు వద్ద ధ్వజమెత్తిన సీపీఎం నాయకులు

నెల్లూరు రూరల్, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : జిల్లాకు ఇద్దరు మంత్రులుండి ఏం లాభం?, కనీసం ప్రజల కష్టాలనూ పట్టించుకోవడం లేదని సీపీఎం నాయకులు ధ్వజమెత్తారు. ఆదివారం రూరల్లోని పొట్టేపాళెం కలుజు వద్ద వరుసగా మూడవ రోజు ధర్నా నిర్వహించారు. పార్టీ నాయకులు మూలే వెంగయ్య, చంద్రమౌళి మాట్లాడారు. పొట్టేపాళెం, ములుముడి కలుజుల మీదుగా రోజుకు 12 వేల వాహనాలు ప్రయాస్తున్నాయని, సుమారుగా 50 వేల మంది రాకపోకలు సాగిస్తున్నారని చెప్పారు. కలుజుల వద్ద నీటి పారుదలతో వీరంతా నిత్యం ప్రాణాంతక పరిస్థితిని చవిచూస్తున్నారని తెలిపారు. కలుజులపై వంతెనలు నిర్మించలేని దుస్థితి ఏర్పడిందని దుయ్యపట్టారు. ఇప్పటికైనా వంతెనల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు జనార్ధన్, తిరుపాలు, శ్రీనివాసులు, అట్లఅనిల్, లక్ష్మీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



కలుజు పై నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

నిమ్మ చెట్ల పరిశీలన

సైదాపురం, జూలై 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మొలకలపూండ్ల రెవెన్యూ కమ్మవారిపల్లి గద్దలతిప్ప వద్ద ప్రభుత్వ భూముల్లో అక్రమంగా సాగు చేస్తున్న నిమ్మ చెట్లను రెవెన్యూ అధికారులు తొలగించగా, వాటిని వెంకటగిరి నియోజకవర్గం వైసీపీ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మస్తాన్ సాగు చేస్తున్న 500 నిమ్మ చెట్లను తొలగించడం దారుణమన్నారు. కార్యక్రమంలో వైసీపీ మండల కన్వీనర్ మన్నారపు రవి కుమార్, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కొండాపు మోహన్‌రావు, నాయకులు ప్రభాకర్ రెడ్డి, న్యాయవాది అబ్బిరాజు, ఉప సర్పంచు బొలిగర్ల శివకుమార్ పాల్గొన్నారు.

'సుపరిపాలనలో తొలి అడుగు'

రాపూరు, జూలై 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెనుబర్తి గ్రామంలో ఆదివారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివ రించారు. ఈ కార్యక్రమంలో రాపూరు మండల ఉపాధ్యక్షుడు ఖాజా మొహిద్దీన్, పెంచలస్వామి పాల్గొన్నారు.



కరపత్రాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

గాంధీ ఆశ్రమంలో సర్వమత ప్రార్థనలు

ఇందుకూరుపేట, జూలై 27 (ఆంధ్రజ్యోతి) :మండలంలోని పల్లెపాడు పినాకినీ సత్యాగ్రహ గాంధీ ఆశ్రమంలో ఆదివారం సర్వమత ప్రార్థనలు జరిగాయి. ముందుగా చిరంజీవి మహాత్మాగాంధీ విగ్రహానికి ఖాదీ వస్త్రాలు, నూలు మాలలు సమర్పించారు. ఆశ్రమ స్థలదాత పొణక కనకమ్మ విగ్రహానికి గాంధీ ఆశ్రమ కమిటీ సభ్యురాలు గంపల మంజుల పట్టువస్త్రాలు, నూలుమాలలు సమర్పించారు. అనంతరం మహాత్మాగాంధీ జీవిత విశేషాలను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ మేనేజర్ మనోజ్, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆరోగ్య రక్ష.. అందని ద్రాక్ష !

- విద్యార్థులకు అందని హెల్త్ కార్డులు

ఇందుకూరుపేట, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల ఆరోగ్య సంరక్షణ కోసం ప్ర భుత్వం 'బాల ఆరోగ్యరక్ష' పథకాన్ని ప్రారంభించింది. అయితే.. విద్యార్థులందరికీ 'ఆరోగ్య' ఫలాలు అందడం లేదని పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తు న్నారు. చిన్నారులు వ్యాధుల బారినపడకుండా వైద్య పరీ క్షలు నిర్వహించి వారి చదువుకు అంతరాయం కలగకుండా విద్య, వైద్యశాఖల అధికారులు ముందస్తుగా తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంది. సకాలంలో విద్యార్థులకు అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించి సంపూర్ణ ఆరోగ్య వంతులుగా తీర్చిదిద్దాల్సిన ప్రభుత్వ అధికారులు నిర్లక్ష్యం వహిస్తుండడంతో ఈ పథకం ముఖ్య ఉద్దేశ్యం దెబ్బ తింటోంది. తగినంతమంది వైద్య అధికారులు, సిబ్బందిని నియమించకపోడంతో 'బాల ఆరోగ్య రక్ష' పూర్తి స్థాయిలో అమలు కావడం లేదు.

విద్యార్థులకు అందని హెల్త్‌కార్డులు

మండలంలో మొత్తం 18 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. ఇంతవరకూ 'బాల ఆరోగ్య రక్ష' కార్డులు ఒక్క విద్యార్థికి కూడా అందించిన దాఖలాలు లేవు. నేషనల్ రూరల్ హెల్త్ మిషన్ ద్వారా కేంద్ర ప్రభుత్వం 'బాల ఆరోగ్య రక్ష' పథకానికి నిధులు సమకూరుస్తుంది. కేంద్ర ప్రభుత్వమే ఈ పథకం అమలును పర్యవేక్షిస్తుంది. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే లక్షలాదిమంది విద్యార్థులకు నాణ్యమైన వైద్య సేవలు అందించవలసి ఉంది. విద్యార్థు లకు హెల్త్‌కార్డులు మంజూరు చేయడంలో అధికారుల అలసత్వం వహిస్తున్నారు. దీంతో ఈ పథకం సక్రమంగా ముందుకు సాగడం లేదు. క్లస్టర్ వైద్య బృందం విద్యార్థులకు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలి. వారు ఆరోగ్యంగా ఉన్నారా? లేదా? అనే అంశాలను నివేది కల్లో పొందుపరచాలి. చాలామంది విద్యార్థులు ప్రాథమిక దృష్టి లోపంతో బాధపడుతున్నారు. వీరికి సరైన వైద్య సేవలు అందడం లేదు. సర్వశిక్షా అభియాన్ ద్వారా ప్రవేశ పెట్టిన 'చిన్నచూపు' కార్యక్రమం మొక్కుబడిగానే సాగు తోంది. చాలా పాఠశాలల్లో దృష్టిలోపం ఉన్న విద్యార్థుల సంఖ్య ఎక్కువగా కనిపిస్తోంది. ఇప్పటికైనా ప్రభుత్వం పూర్తి స్థాయిలో వైద్య సిబ్బందిని నియమించి విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు తగిన చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



నరసాపురం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల చిన్నారులు

ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డికి పదవిపై హర్షం

బుచ్చిరెడ్డిపాళెం, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమం, వికలాం గు లు, వయోవృద్ధుల సంక్షేమానికి సంబంధించి రాష్ట్ర అసెంబ్లీ, మండలి సంయుక్త కమిటీ సభ్యురాలిగా నియమించడం హర్షణీయమని టీడీపీ బుచ్చి అర్బ న్, రూరల్ అధ్యక్షులు గుత్తా శ్రీనివాసులు, బెజవాడ జగదీష్ పేర్కొన్నారు. అసెంబ్లీలో ప్రజా సమ్యలపై గళం వినిపిస్తూ, నిరంతరం ప్రజా సమస్యల పరి ష్కారానికి పాటుపడుతున్న ప్రశాంతి రెడ్డికి ముఖ్యమంత్రి చంద్రబాబు సమర్థవంతమైన పదవిని కట్ట బెట్టారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మహిళాదరణ పొందిన ప్రశాంతిరెడ్డికి పదవి లభించడం పట్ల కోవూరు టీడీపీ శ్రేణుల్లో హర్షం వ్యక్తమౌతోంది. బుచ్చి మండల, అర్బన్ క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు రామానాయుడు, ఎన్‌వీ ప్రసాద్, నాయకులు ఎంవీ శేషయ్య, హరికృష్ణ, కోదండరామిరెడ్డి, మహేం ద్ర, పెంచలయ్య, రాము తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

టీడీపీ నేత మృతికి సంతాపం

ఉలవపాడు, జూలై 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ ఏఎంసీ డైరెక్టర్ మల్లవరపు సుబ్బారెడ్డి అనారోగ్యంతో శనివారం రాత్రి మృతిచెందగా ఆదివారం పార్టీలకు అతీతంగా మండలంలోని పలువురు ఆయన మృతికి సంతాపం తెలిపారు. మధ్యాహ్నం కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సుబ్బారెడ్డి పార్థీవ దేహాన్ని సందర్శించి ఘన నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. అదేవిధంగా మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దివి శివరాం సుబ్బారెడ్డి మృతిపట్ల సంతాపం తెలిపి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

స్మార్ట్ మీటర్లు వద్దు

కోవూరు, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ మోటార్లకు స్మార్ట్ మీటర్ల ఏర్పాటు చేయవద్దని కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి తుళ్లూరు గోపాల్ అన్నారు. స్థానిక సీతాపోలయ్య భవనంలో ఆదివారం జరిగిన కౌలు రైతుసంఘం మహాసభలో ఆయన మాట్లాడారు. స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తే పగుల గొట్టండని గత ప్రభుత్వాన్ని కూటమి నేతలు అప్పట్లో విమర్శించి, నేడు తిరిగి వేగంగా స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయడమేంటని ప్రశ్నించారు. కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డు లివ్వాలన్నారు. మహాసభలో కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ముత్యాల గురు నాథం, నాయకుడు చాంద్‌బాషా మాట్లాడారు. నూతన డివిజన్ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులుగా కరకంబాక గోవర్ధన్, కందిపాటి తిరుపతి ఎంపికయ్యారు.



కౌలురైతు సంఘం నూతన కమిటీ

బీజేపీలోనే కార్యకర్తలకు అధిక ప్రాధాన్యం

మనుబోలు, జూలై 27 (ఆంధ్రజ్యోతి): దేశంలోని పార్టీల్లోకెల్లా కార్యకర్తలకు అధిక ప్రాధాన్యత ఇచ్చేది బీజేపీ మాత్రమేనని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర నాయకుడు కర్నాటి ఆంజనేయరెడ్డి పేర్కొన్నారు. బద్దెవోలులో ఆది వారం నూతన బీజేపీ మండ లాధ్యక్షుడిగా ఎన్నికైన వాసిరెడ్డి రామిరెడ్డి ప్రమాణస్వీకార కార్యక్రమం నిర్వ హించారు. ఈ సందర్భంగా రామిరెడ్డిని శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. రానున్న రోజుల్లో రాష్ట్రంలో బీజేపీ బలమైన శక్తిగా ఎదుగుతుందన్నారు. యువతకు బీజేపీ ఆహ్వానం పలుకుతోందన్నారు. మండలంలో పార్టీని మరింత పటిష్టం చేయగల శక్తి రామిరెడ్డికి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సర్వేపల్లి ఇన్‌చార్జి కాకుటూరు సురేంద్ర రెడ్డి, నాయకులు ఆరుమూళ్ళ మురళి, మోహన్‌బాబు, బోలా శ్రీనివాసులు, పెనమల్లి వెంకటకృష్ణారెడ్డి, అడపాల శివకుమార్‌రెడ్డి, అల్లాబాషా, శూలం, ఇరగరాజు వెంకయ్య పాల్గొన్నారు.



రామిరెడ్డిని అభినందిస్తున్న ఆంజనేయరెడ్డి

యువత క్రీడలపై దృష్టి సారించాలి

ఇందుకూరుపేట, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : యువత క్రీడలపై దృష్టి సారించాలని అమ్మ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు దొడ్ల మల్లికార్జున్ అన్నారు. ఆదివారం మార్నింగ్ స్టార్స్ ఆధ్వర్యంలో నరసాపురం ఎంవీఆర్ఆర్ పాఠశాలలో క్రికెట్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన బహుమతులు అందజేశారు. బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంపల అనిల్‌కుమార్ విచ్చేసి గెలుపొందిన క్రీడాకారులకు బహుమతి ప్రధానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత చెడు మార్గం వైపు వెళ్లకుండా క్రీడల వైపు మొగ్గు చూపాలన్నారు. దేశంలో యువత మత్తుకు బానిస అయిన నేపథ్యంలో మార్నింగ్ స్టార్స్ యూత్‌ను యువత ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు శారీరక ఆరోగ్యం మెరుగుపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజర్స్ నరేష్, సురేష్, క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.



జ్ఞాపికలు అందజేస్తున్న అమ్మ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు

కమాన్.. బసవన్నా.. కమాన్!

- గంగవరంలో ఎడ్ల పరుగు పందెం పోటీలు

కోవూరు, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : మండలపరిధిలోని గంగవరంలో ఆదివారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా ఎడ్ల పందెం పోటీలు నిర్వహించారు. ఉత్సాహంగా సాగిన ఈ పోటీల్లో ఇందుకూరుపేట మండల పరిధిలోని గంగపట్టణం శ్రీ చాముండేశ్వరీ దేవి సీ ఫుడ్స్‌కు చెందిన ఎడ్లు ప్రథమస్థానంలో నిలిచాయి. బాపట్ల వాసి నల్లమోతు గోపీకృష్ణకు చెందిన ఎడ్లు రెండో స్థానం, బుచ్చిరెడ్డిపాళెం మండలం మినగల్లు వాసి మోచర్ల పార్థుకు చెందిన శ్రీవేమాలమ్మ తల్లి ఎడ్లు మూడోస్థానాన్ని సాధించాయి. నెల్లూరు రూరల్ మండల పరిధిలోని సౌత్‌మోపూరు గ్రామానికి చెందిన మోపూరమ్మ తల్లి జట్టు ఎడ్లు నాలుగోస్థానం, అల్లూరుకు చెందిన జరుగుమల్లి మోహనచందు జట్టు ఎడ్లు ఐదో స్థానాన్ని సాధించాయి. పోటీలలో నెల్లూరు, బాపట్ల, ప్రకాశం జిల్లాల నుంచి 25 జట్ల ఎడ్లు పాల్గొన్నాయి. గెలుపొందిన ఎడ్ల జట్ల యజమానులకు నిర్వాహకులు ఆమారి ప్రేమ కుమార్, చింతల బాబు, తలారి శ్రీనివాసులు, టీడీపీ నాయకుడు బుధవరపు శివకుమార్ ప్రశంసాపత్రాలు, బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన డప్పు నృత్యాలు, కర్రసాము, భక్తి గీతాలతో పండుగ వాతావరణ నెలకొంది.



పరుగుపందెం పోటీలో సత్తా చాటుతున్న ఎడ్లు

ఘనంగా పెంచలస్వామి ఆరాధన మహోత్సవం

ఆత్మకూరు, జూలై 27 (ఆంధ్రజ్యోతి): దేపూరు సమీపంలోని హనుమాన్ జంక్షన్ వద్ద ఆదివారం హనుమాన్‌భక్త శ్రీ పెంచలస్వామి ఆరాధన మహోత్సవం ఘనంగా నిర్వహించారు. పెంచలస్వామి, సాయిబాబా, ఆంజనేయస్వామి, వెంకయ్యస్వామి, రామలక్ష్మణులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిర్వాహకులు భాస్కర్‌నాయుడు, పెంచల నాయుడు, సర్పంచ్ రావిళ్ల వెంకటేశ్వర్లు, ఉపసర్పంచ్ కన్నం వెంకట సుబ్బయ్య, దొడ్ల సుమన్, కొల్లా ఆదిశేషయ్య తదితరులు పాల్గొన్నారు.



కొత్తగా ఎంపికైన కమిటీ సభ్యులు

ఇంటర్ విద్య ఉద్యోగుల సంఘం ఎంపిక

నెల్లూరు(విద్య), జూలై 27 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ విద్యా శాఖ ఉద్యోగుల సర్వీస్ అసోసియేషన్ జిల్లా కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. నెల్లూరులోని కేఏసీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆదివారం జరిగిన సమావేశంలో ఉద్యోగులు కొత్త కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎస్కే అజ్మత్, ఉపాధ్యక్షుడిగా పీ శ్రీకాంత్, కార్యదర్శిగా ఎస్డీ సమద్, సంయుక్త కార్యదర్శిగా ఎం శివకుమార్, మహిళా సంయుక్త కార్యదర్శిగా వీఎం మౌనిక ప్రియదర్శిని, కోశాధికారిగా సుబ్రహ్మణ్యం, నిర్వాహక కార్యదర్శిగా సీహెచ్ దిలీప్‌కుమార్, ఎగ్జిక్యూటివ్ సభ్యుడిగా కొండయ్య ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారి ఏవీ కృష్ణకుమార్, సహ ఎన్నికల అధికారి ఎం శ్రీనివాసులు కలిసి నూతన కమిటీతో ప్రమాణ స్వీకారం చేయించారు.

ఆకట్టుకున్న నృత్యోత్సవం

నెల్లూరు (సాంస్కృతికం), జూలై 27 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మకత, సంస్కృతి సమితి (భాషా సాంస్కృతిక శాఖ) సౌజన్యంతో హరివిల్లు క్రియేషన్స్ ఆధ్వర్యంలో ఆదివారం శాస్త్రీయ జానపద నృత్యోత్స వం, హరివిల్లు ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవం నెల్లూరు టౌన్‌హాలులో ఘనంగా జరిగాయి. శ్రీగురుకృపా కళాక్షేత్రం, శ్రీసిద్ధేంద్ర యోగి కూచిపూడి కళాక్షేత్రం, శ్రీనందికేశ్వర కూచిపూడి కళాక్షేత్రం, శ్రీసాయి లలిత నృత్య నికేతన్‌కు చెందిన కళాకారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. విశాలాక్షి వృద్ధాశ్రమం అధినేత డాక్టర్ కోసూరు రత్నం, గిన్నిస్ వరల్డ్ రికార్డ్ హోల్డర్, ప్రముఖ చిత్రకారుడు డాక్టర్ షేక్ అమీర్‌జాన్, ప్రముఖ నృత్య గురువులు సురభి గాయత్రి, డేగల సాంబశివ రావు, పాల జ్యోత్స్న, శిరీషలతకు హరివిల్లు పురస్కారాలు అందజేశారు. ఇటీవల అంతర్జాతీయ విశ్వ విద్యాలయాల నుంచి డాక్టరేట్లు పొందిన హైటెక్ ఫార్మా అధినేత ఎన్వీ రమణారెడ్డి, ఎన్వీఆర్ స్కూల్ కరస్పాండెంట్ అందే శ్రీనివాసులుకి ఆత్మీయ సత్కారం చేశారు. ఈ కార్యక్రమంలో 25 కళా సంఘాల అధ్యక్షుడు అమరావతి కృష్ణారెడ్డి, హరివిల్లు క్రియేషన్స్ వ్యవస్థాపక అధ్యక్షుడు దోర్నాల హరిబాబు, శుభమస్తు షాపింగ్‌మాల్ అధినేత బయ్యా రవికుమార్, శ్రేయ రియల్ ఎస్టేట్ ఎండీ డాక్టర్ కే బాబుఅగస్టస్ తదితరులు పాల్గొన్నారు.



శాస్త్రీయ నృత్య ప్రదర్శనలో బాలలు

31న మాజీ సీఎం జగన్ రాక

- కాకాణితో ములాఖత్, ప్రసన్నకు పరామర్శ

నెల్లూరు(క్రైం/వెంకటేశ్వరపురం), జూలై 27(ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఈ నెల 31న జిల్లా పర్యటనకు వస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఆయన మరో ఎమ్మెల్సీ తలశిల రఘురాంతో కలసి ఆదివారం చెముడుగుంట సెంట్రల్ జైలు సమీపంలో జగన్ రాక కోసం హెలీప్యాడ్ స్థలాన్ని పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ సెంట్రల్ జైలులో ఉన్న వైసీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణితో జగన్ ములాఖత్ అవుతారన్నారు. అక్కడి నుంచి రోడ్డు మార్గాన మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి నివాసానికి చేరుకొని ఆయనను పరామర్శిస్తారని తెలిపారు. ఆ తర్వాత హెలీప్యాడ్‌కు చేరుకొని తాడేపల్లి బయలుదేరి వెళ్తారని చెప్పారు. కాగా, జగన్ పర్యటన నేపథ్యంలో వైసీపీ నాయకులు హెలీప్యాడ్ ఏర్పాటు చేసుకుని అధికారుల అనుమతి కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈ క్రమంలో ఆదివారం ఏఎస్పీ సీహెచ్ సౌజన్య, రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు, విద్యుత్‌శాఖ, ఇతర శాఖల అధికారులు హెలీప్యాడ్ స్థలాన్ని పరిశీలించి నివేదికను కలెక్టర్‌కు అందించారు.



మాట్లాడుతున్న జిల్లా సాధన సమితి అధ్యక్షుడు డాక్టర్ వేణుగోపాల్

ప్రజాప్రతినిధులు ముందుకొస్తేనే జిల్లా సాధ్యం


- ఉదయగిరి జిల్లా సాధన సమితి అధ్యక్షుడు వేణుగోపాల్

ఉదయగిరి, జూలై 27(ఆంధ్రజ్యోతి): మెట్ట ప్రాంతమైన ఉదయగిరిని జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేయాలని ఆరేళ్లుగా ఉద్యమం కొనసాగిస్తున్నామని ఉదయగిరి జిల్లా సాధన సమితి అధ్యక్షుడు డాక్టర్ కే.వేణుగోపాల్ అన్నారు. ఆదివారం స్థానిక ఐటీఐ కళాశాలలో విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు ముందుండి నడిపించిన ఉద్యమాలు విజయవంతమవుతాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏడుగురు మంత్రుల కమిటీని నియమించి నూతన జిల్లాల కోరుకునే ప్రాంతాల నుంచి ప్రజాభిప్రాయం సేకరించాలని ఆదేశించిందన్నారు. గత ప్రభుత్వం అశాస్త్రీయంగా జిల్లాల పునర్విభజన చేపట్టిందన్నారు. కొంతమంది నాయకులు జిల్లా ఉద్యమంపై అవగాహన రాహిత్యంతో మాట్లాడుతున్నారని ఆయన అన్నారు. దశాబ్దాల తరబడి సాగు, తాగునీరు కరువై విద్యా, వైద్యం గగనమై.. బంగారం పండే భూములు బీళ్లుగా మారి కుటుంబ సమేతంగా వలసబాట పడుతున్నారన్నారు. వీటన్నింటికి పరిష్కారం ఉదయగిరిని జిల్లా చేయడం ఒక్కటే మార్గమని వారు తెలుసుకోవాలన్నారు. ఇకనైనా పార్టీలకతీతంగా ప్రతిఒక్కరూ జిల్లా సాధన కోసం ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైందని, నాయకులు మేల్కొవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జిల్లా సాధన సమితి నాయకులు దస్తగిరిఅహ్మద్, ఖాదర్ బాషా, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యానికి మూల్యం తప్పదు !

- ఆందోళన కలిగిస్తున్న హెపటైటిస్ వ్యాధి
- తీవ్రమైతే లివర్ మార్పిడి తప్పనిసరి
- అవగాహన లేకనే ఎంతోమంది అనారోగ్యంపాలు
- నేడు ప్రపంచ హెపటైటిస్ వ్యాధి నివారణ దినం

నెల్లూరు (వైద్యం) జూలై 27 (ఆంధ్రజ్యోతి): హెపటైటిస్ వ్యాధి ఎంతో ప్రమాదకరమని వైద్యులు చెబుతున్నారు. ఈ వ్యాధిని ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా ప్రాణాపాయం తప్పదని వారంటు న్నారు. ఇది శరీరంలోని కాలేయం(లివర్)పై తీవ్ర ప్రభావం చూపుతుంది. ఏ, బీ, సీ, డీ, ఈ అనే ఐదు రకాలుగా వెలుగుచూసే ఈ వ్యాధిలో హెపటైటిస్ బీ ప్రమాదకరమైనదిగా వైద్యనిపుణులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రపంచ ఆరోగ్యసంస్థ హెపటైటిస్‌వ్యాధి నివారణకు కృషిచేయాలని పిలుపునిచ్చింది. వ్యాధిపై ప్రజల్లో అవగాహన కల్పించేదిశగా ప్రతిఏటా జూలై 28న (నేడు) ప్రపంచ హెపటైటిస్ నివారణదినం జరుపుకోవాలని నిర్ణయించింది.



హెపటైటిస్ వ్యాధి వైరస్

వ్యాధి తీవ్రమైతే లివర్ మార్పిడే మార్గం

వ్యాధి తీవ్రత సిర్రోలిక్ దశకు చేరుకుంటే కాలేయం పూర్తిగా దెబ్బతింటుంది. ఈ దశలో కాలేయ మార్పిడి తప్పనిసరి. గర్భిణీలు ఎక్కువగా హెపటైటిస్‌కు గురయ్యే అవకాశం ఉండడంతో మూడు నెలలకు తప్పనిసరిగా హెపటైటిస్ బీ పరీక్ష చేస్తారు. గర్భిణీకి ఈ వ్యాధి ఉంటే పుట్టే చిన్నారికి కూడా వచ్చే అవకాశం ఉంది. కలుషితమైన ఆహారం, నీటి ద్వారా ఇది వ్యాపిస్తుంది. మల వ్యర్థాలు తాగునీటిలో కలవటం వల్ల, అపరిశుభ్రమైన వాతావరణం, వ్యక్తిగత పరిశుభ్రత పాటించక పోవటం వల్ల కూడా వ్యాధి వస్తుంది. గుర్తించి వెంటనే చికిత్స చేయించుకోకపోతే ప్రాణాపాయానికి దారితీస్తుంది. పలువురికి వ్యాధిపై అవగాహన లేకనే అనారోగ్యం పాలవుతున్నారు. వైద్యశాఖ అవగాహన కల్పించాల్సి ఉంది.

ఏటేటా పెరుగుతున్న వ్యాధిగ్రస్థులు

జిల్లావ్యాప్తంగా హెపటైటిస్ వ్యాధిగ్రస్థుల సంఖ్య ఏటేటా పెరుగుతోంది. వివిధ ప్రాంతాల్లో అపరిశుభ్రమైన వాతా వరణం, కలుషితమైన నీటి కారణంగా ఈ పరిస్థితి తలెత్తుతుంది. ఎక్కువగా మురికి వాడల్లోనూ, ఎస్సీ, ఎస్టీ కాలనీల్లోనూ హెపటైటిస్ బీ నమోదు కావటం గమనార్హం. వైద్య ఆరోగ్యశాఖ ఆయా ప్రాం తాలపై దృష్టిపెట్టి తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంది. ఈ వ్యాధి రాకుండా వాధి నిరోధక టీకా కూడా అందుబాటులో ఉంది. అయితే దీని ధర బయట మార్కెట్‌లో అధికంగా ఉండటంతో పేదలు కొనలేని పరిస్థితి. దీన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఈ టీకాను అందుబాటులోకి తీసుకురావాలి.

జిల్లాలో నమోదయిన కేసుల వివరాలు

సంవత్సరం	ప్రభుత్వ ఆసుత్రుల్లో నమోదయిన కేసులు	ప్రైవేట్ ఆసుపత్రుల్లో నమోదయిన కేసులు
2021	124	450
2022	205	515
2023	404	712
2024	262	831
2025	388	932 (జూలై వరకు)

అధికంగా మద్యం సేవించడం వల్ల...

అతిగా మద్యం సేవించే వారిలో ఎక్కువశాతం మంది హెపటైటిస్ వ్యాధి బారిన పడుతున్నట్లు తెలుస్తోంది. శరీరంలో చేరే మద్యాన్ని విసర్జించే క్రమంలో కాలేయం అధిక శ్రమకు గురవుతుంది. కాలేయం సామర్థ్యానికి మించి మద్యం సేవిస్తూ ఉంటే క్రమంగా కాలేయం దెబ్బతింటుంది. ఫలితంగా ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్ డిసీజ్, ఆల్కహాలిక్ హెపటైటిస్ ఆల్కహాలిక్ సిర్రోసిస్ వ్యాధులు వస్తాయి. హెపటైటిస్ బీ, హెపటైటిస్ సీ వైరస్‌ల వల్ల కాలేయం క్యాన్సర్‌కు గురవుతుంది.

వ్యాధితో ప్రాణాలకే ముప్పు...



హెపటైటీస్ వ్యాధి వల్ల ప్రాణాలకే ముప్పు వస్తుంది. ఈ వ్యాధి పట్ల ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి. వ్యాధిగ్రస్తుడు జీవితాంతం మందులు వాడాల్సిందే. వ్యాధి రాకముందే టీకా వేయించుకుంటే వ్యాధి వచ్చే అవకాశం లేదు. వ్యాధి ముదిరితే కాలేయం మార్పిడే శరణ్యం. హెపటైటీస్‌లో బీసీ రకాలు అత్యంత ప్రమాదమైనవి. వ్యాధిని మొదటి దశలోనే గుర్తిస్తే చాలా వరకు నయం చేయవచ్చు.

- డాక్టర్ సునీల్‌కుమార్, అసోసియేట్ ప్రొఫెసర్, జీజీహెచ్



నగరంలో వడ్డెర్ల ప్రదర్శన

వడ్డెర్లకు భద్రత, రక్షణ కావాలి

- ఏపీ వడ్డెర వృత్తిదారుల సంఘం రాష్ట్ర కన్వీనర్ దయాకర్

నెల్లూరు (వైద్యం), జూలై 27 (ఆంధ్రజ్యోతి) : వడ్డెరలకు భద్రత, సామాజిక రక్షణ కల్పించాలని ఏపీ వడ్డెర వృత్తిదారుల సంఘం రాష్ట్ర కన్వీనర్ గుంజి దయాకర్ డిమాండ్ చేశారు. వడ్డెర వృత్తిదారుల సంఘం రాష్ట్ర మహాసభ ఆదివారం నెల్లూరులోని ఏనుగు సందరరామిరెడ్డి ఆడిటోరి యంలో జరిగింది. ముందుగా వీఆర్సీ కూడలి నుంచి ఆర్టీసీ వరకు ప్రదర్శన నిర్వహించారు. సభలో దయాకర్ మాట్లాడుతూ కంకర, గ్రావెల్, ఎర్రమట్టి కొండలపై 50 శాతం హక్కును వడ్డెరలకు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. చిత్తూరులో వడ్డెర మహిళపై అత్యాచారం చేసి బావిలో పడేశారన్నారు. నెల్లూరు జిల్లా అల్లూరులో డిగ్రీ చదువుతున్న యువతిపై అత్యాచారం చేసి చెరువులో పూడ్చిన ఘటన ఆందోళన కలిగిస్తోందన్నారు. వడ్డెర కులస్తుల కోసం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ వంటి చట్టాన్ని తీసుకురావాలన్నారు. చేతివృత్తిదారుల సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ భాస్కరయ్య మాట్లాడుతూ వడ్డెర వృత్తిదారులకు ఆధునిక పనిముట్లు లభించేలా ప్రభుత్వం ఆర్థిక చేయూతనందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకుడు నరసింహారావు, వడ్డెర వృత్తిదారుల సంఘం నాయకులు పాల్గొన్నారు.

3,4 తేదీల్లో సీపీఐ జిల్లా మహాసభలు

నెల్లూరు రూరల్, (ఆంధ్రజ్యోతి) : సీపీఐ జిల్లా మహాసభలను ఆగస్టు 3, 4 తేదీల్లో నెల్లూరులో నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య తెలిపారు. ఆదివారం నెల్లూరు రూరల్లోని సౌత్‌మోపూరు గ్రామంలో పార్టీ మండల మహాసభలు జరిగాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ దేశంలో ప్రజా ఉద్యమాలు, భూ పోరాటా లతో సీపీఐ పేదలు, కార్మికులకు అండగా నిలిచిందని చెప్పారు. వందేళ్లు పూర్తయిన సందర్భంగా వేడుకలు జరుపుకుంటున్నట్లు తెలిపారు. కాగా, ఈ కార్యక్రమా నికి ముందు కేరళ మాజీ సీఎం అచ్యుతానందన్‌కు ఘనంగా నివాళి అర్పించారు. పార్టీ జెండాను ఆవిష్కరించారు. మండల కార్యదర్శిగా కొప్పోలు అంకయ్య, సహాయ కార్యదర్శిగా వై ఆదినారాయణ సహా 17 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా చేనేత కార్మిక సంఘం అధ్యక్షుడు పముజుల హరి, నాయకులు పముజుల దశరథరామయ్య, వీ రామరాజు, సిరాజ్, లీలామోహన్, రమణయ్య, మాలకొండ య్య, చల్లా నరసయ్య, శ్రీరాములు పాల్గొ న్నారు. సీనియర్ నాయకులను సత్కరించారు.



పార్టీ సీనియర్లను సత్కరిస్తున్న నాయకులు

యువతి అదృశ్యంపై కేసు

నెల్లూరు(క్రైం), (ఆంధ్రజ్యోతి): యువతి అదృశ్యమైన ఘటనపై వేదాయపాళెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. నగరంలోని సుందరయ్య కాలనీకి చెందిన ఓ యువతి నగరంలోని ఓ వైద్యశాలలో నర్సుగా పనిచేస్తోంది. ఆమె ఈ నెల 25వ తేదీ రాత్రి ఇంటి నుంచి అదృశ్యమైంది. కుటుంబ సభ్యులు గాలించినా ప్రయోజనం లేకపోవ డంతో శనివారం అర్ధరాత్రి వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. హౌసింగ్‌బోర్డు కాలనీకి చెందిన కార్తీక్ సాయిపై అనుమానం ఉందని ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

లారీకి, గోడకు మధ్య నలిగి వ్యక్తి దుర్మరణం

నెల్లూరు(క్రైం), జూలై 27(ఆంధ్రజ్యోతి): రైసు మిల్లులోకి వెళ్లేందుకు లారీ డ్రైవర్‌కు దారి చూపుతుండగా ప్రమాదవశాత్తు లారీకి, గోడకు మధ్య ఇరుక్కుపోయి ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల సమాచారం మేరకు... నెల్లూరులోని పరమేశ్వరినగర్‌కు చెందిన జీ సురేష్(46) నగరంలోని బియ్యం దళారుల వద్ద గుమస్తాగా పనిచేస్తున్నారు. ఆయన ఆదివారం లక్ష్మీపురంలోని ఓ రైస్ మిల్లులో బియ్యాన్ని లారీలో లోడ్ చేయించేందుకు వెళ్లారు. లారీ రైస్‌మిల్లులోకి వెళ్లేందుకు డ్రైవర్‌కు దారి చూపిస్తుండగా లారీని డ్రైవర్ వేగంగా నడపడంతో లారీ, గోడ మధ్య సురేష్ నలిగి పోయారు. తీవ్రగాయాలైన అతనిని స్థానికులు ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కొద్దిసేపటికే మృతిచెందారు. సమాచారం అందుకున్న నార్త్ ట్రాఫిక్ పోలీసులు వైద్యశాలకు చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. ప్రమాదానికి కారణమైన లారీని స్వాధీనం చేసుకున్నారు. సురేష్ భార్య శారద ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



ప్రశంసాపత్రం అందుకుంటున్న రైతు బిల్లా రఘురామయ్య

సౌత్ ఇండియా యోగా పోటీల్లో 'బిల్లా' ప్రతిభ

- జిల్లా రైతుకు ప్రథమ బహుమతి

బుచ్చిరెడ్డిపాళెం, జూలై 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన రైతు బిల్లా రఘురామయ్య కాగులపాడు కీర్తిని జాతీయ స్థాయిలో ఇనుమడింపజేశారు. చెన్నైలోని టీ నగర్‌లో పద్మ యోగా నేచురల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన సౌత్ ఇండియా యోగాసన ఛాంపియన్‌షిప్ పోటీలలో బుచ్చిరెడ్డిపాళెం మండలం, కాగుల పాడు (కాళయకాగొల్లు) గ్రామానికి చెందిన నెల్లూరు జిల్లా చెరకు రైతు సంఘం అధ్య క్షుడు బిళ్ళా రఘురామయ్య ప్రథమ బహు మతి సాధించారు. గత నెలలోనూ కలకత్తాలో జరిగిన జాతీయ స్థాయి యోగా పోటీలలో ద్వితీయ బహుమతి సాధించారు. 67 ఏళ్ళ వయసులో ఈ ఘనత సాధించిన రఘురామయ్యను పలువురు అభినందించారు.

చేపల గుంటలో పడి గిరిజనుడి మృతి

కావలి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): కావలి రూరల్ మండలం గౌరవరానికి చెందిన వేటగిరి శీనయ్య (40) అనే గిరిజనుడు ఆదివారం ఉదయం చేపలు పట్టేందుకు గ్రామంలోని క్రిష్ణంరాజు గుంట వద్దకు వెళ్లి చేపలు పడుతూ గుంటలో మునిగిపోయి ఊపిరాడక చనిపోయాడు. ఆయనతో పాటు చేపల వేటకు వెళ్లిన వారు విషయం కుటుంబ సభ్యులకు తెలిపారు. దీంతో మృతుడు శీనయ్య సతీమణి సిద్దాలమ్మ కావలి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆమేరకు రూరల్ ఎస్ఐ బాలక్రిష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

ఉదయగిరి, జూలై 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీ.అయ్యవారిపల్లి ఎస్సీ కాలనీకి చెందిన మైనర్ బాలిక కొసినపోగు ఇందు అదృశ్యమైనట్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి ఆదివారం తెలిపారు. శుక్రవారం రాత్రి నుంచి ఇందు కనిపించడంలేదని తల్లిదండ్రులు ఎలీషమ్మ, జాన్ ఫిర్యాదు చేశారన్నారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

బైక్ చోరీ

నెల్లూరు(క్రైం), జూలై 27(ఆంధ్రజ్యోతి): నెల్లూరులోని సుందరయ్య కాలనీ జాషువా నగర్‌లో బైక్ దొంగతనంపై వేదాయపాళెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. జాషువా నగర్‌లో నివసించే చల్లా ప్రసాద్ నగరంలోని పినాకినీ బార్‌లో క్యాషియర్‌గా పనిచేస్తున్నారు. ఈ నెల 11వ తేదీ మధ్యాహ్నం భోజనానికి ఇంటికి వెళ్లారు. బయట బైక్ నిలిపి ఇంటిలోకి వెళ్లి భోజనం చేసి వచ్చే సరికి వాహ నం కనిపించలేదు. చుట్టుపక్కల వెతికినా ప్రయోజనం లేకపోవడంతో ఆదివారం వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మోటర్ బైక్ బోల్తా : వ్యక్తికి గాయాలు

సీతారామపురం , జూలై 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెదనాగంపల్లి గ్రామం వద్ద ఆదివారం కుక్కలు అడ్డు రావడంతో మోటారు బైక్‌పై నుంచి పడి చిన్నాగంపల్లెకు చెందిన మునగల రమణారెడ్డి అనే వ్యక్తికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు సీతారామపురం నుంచి రమణారెడ్డి తన కుమార్తెను మోటార్ బైకుపై ఎక్కించుకుని చిన్నాగంపల్లెకు బయలుదేరాడు. పెదనాగంపల్లి వద్దకు వచ్చేసరికి కుక్కలు ఒక సారిగా అడ్డురావడంతో బైక్ అదుపు తప్పి పడిపోవడంతో గాయాల పాలయ్యాడు. క్షతగాత్రుడిని 108 వాహనంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు. కుమార్తె చిన్న చిన్న గాయాలతో బయటపడింది.





అవార్డులు అందుకుంటున్న డాక్టర్ అల్లం ఉదయ్ శంకర్, డాక్టర్ వెంకటసుబ్బారెడ్డి

వీఎస్‌యూ ఆచార్యులకు ప్రతిష్టాత్మక అవార్డులు

వెంకటాచలం, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : విక్రమ సింహపురి యూనివర్సిటీకి చెందిన ఇద్దరు ఆచార్యులు కమ్యూనిటీ డెవలప్‌మెంట్ విభాగంలో విశ్వగురు వరల్డ్ రికార్డ్స్ గేమ్ ఛేంజర్ - 2025 అవార్డులు అందు కున్నారు. ఆదివారం హైదరాబాదులో జరిగిన ప్రదానోత్సవ సభలో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి లక్ష్మీనారాయణ చేతులమీదుగా ఎన్ఎస్ఎస్ సమన్వ యకర్త డాక్టర్ అల్లం ఉదయ్ శంకర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ బీ వెంకటసుబ్బారెడ్డి స్టేట్ లెవల్ గేమ్ ఛేంజర్ అవార్డులను అందుకున్నారు. రాష్ట్ర స్థాయి అవార్డులు సాధించిన ఆచార్యులను వర్సిటీ వీసీ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాస రావు, రిజిస్ట్రార్ డాక్టర్ కే సునీత, ప్రిన్సిపాల్ సీహెచ్ విజయ అభినందించారు.

అనుమానాస్పదంగా యువకుడి మృతి

నెల్లూరు(క్రైం), జూలై 27(ఆంధ్రజ్యోతి): నెల్లూరులో ఓ యువకుడు ఇంట్లో అనుమానస్పద స్థితిలో మృతి చెందాడు. పోలీసుల సమాచారం మేరకు... జిల్లాలోని విడవలూరు మండలం వావిళ్ళ గ్రామానికి చెందిన ప్రసన్న కుమార్, శిరీష దంపతులకు ఇద్దరు సంతానం. పెద్ద కుమారుడు తరుణ్‌తేజ(27)కు 8 ఏళ్ల క్రితం ప్రవల్లికతో వివాహమైంది. వారికి ఇద్దరు కుమారులున్నారు. తరుణ్ తేజ యాక్టింగ్ కారు డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. నాలుగేళ్ల క్రితం అతని అదే గ్రామానికి చెందిన ఓ మహిళతో పరిచయం ఏర్పడి, వారి మధ్య సాన్ని హిత్యం పెరిగింది. దీనివల్ల కుటుంబాన్ని పట్టించుకోకపోవడంతో భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. ఈ నేపథ్యంలో భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో తరుణ్‌తేజ నెల్లూరులోని పొదలకూరు రోడ్డు ఎన్‌సీసీ కాలనీలో ఓ ఇంటిని అద్దెకు తీసుకొని సన్నిహితంగా ఉంటున్న మహిళతో కలిసి జీవిస్తున్నాడు. కొంతకాలం క్రితం తల్లి వద్దకు వచ్చి భార్యను దూరం చేసుకున్నందుకు బాధపడ్డాడు. ఇదిలా ఉండగా ఆదివారం మధ్యాహ్నం తరుణ్ తేజ తల్లికి అశోక్ అనే వ్యక్తి ఫోన్‌చేసి ఇంట్లో తరుణ్‌తేజ ఉరేసుకొని చనిపోయాడని చెప్పాడు. దీంతో హుటాహుటిన తల్లి, భార్య ప్రవల్లిక, కుటుంబ సభ్యులు ఎన్‌సీసీ కాలనీకి చేరుకుని కన్నీరుమున్నీరయ్యారు. సహజీవనం చేస్తున్న మహిళను ప్రశ్నించగా తాను ఇంట్లో లేని సమయంలో తరుణ్ ఆత్మహత్య చేసుకున్నట్లు చెప్పింది. దీంతో తల్లి శిరీష కుమారుడి మృతిపై అనుమానాలు ఉన్నాయంటూ వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బాలుడిని బలిగొన్న ట్రాక్టర్

- నిద్రిస్తున్న చిన్నారిపై నుంచి వెళ్లిన వాహనం

అనంతసాగరం, జూలై 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కమ్మవారిపల్లి దర్మపల్లెమ్మ ఆలయం సమీపంలో ఆదివారం తెల్లవారు జామున ట్రాక్టర్ తొక్కేయడంతో ఆరేళ్ల బాలుడు మృతిచెందాడు. పోలీసుల వివరాల మేరకు... ఎం శ్రీనివాసులు, రమణమ్మ అనే గిరిజన కుటుంబం ఆలయం సమీపంలో ఒక చిన్నగదిలో కాపురం ఉంటున్నారు. ఉత్తర కాలువలో చేపలు పట్టుకుంటూ, పొలాలకు కాపలా ఉంటూ జీవనం సాగిస్తున్నారు. వారికి ఆరుగురు సంతానం. కాగా, శనివారం వారు ఆరుబయట నిద్రిస్తున్న సమయంలో కూలీలతో పొలాల్లోకి వెళ్తున్న ట్రాక్టర్ నాగరాజు (6) అనే బాలుడి మీదుగా వెళ్లడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. ట్రాక్టరు ఆ గ్రామానికి చెందిన ఓ నాయకుడిది కాగా ఈ విషయం బయటకు పొక్కనియ్యకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. ఈ విషయంపై సోమశిల ఎస్ఐ అనుషాను వివరణ కోరగా గ్రామ వీఆర్వో ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	134
స్కిన్ చికెన్	240
స్కిన్‌లెస్	264

కోడిగుడ్ల ధర (100) : 475

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9435
వెండి కిలో ధర	రూ. 116400
వెండి ఒక గ్రాము	రూ.119.40

సీపీఎం నేత అరెస్టుకు నేతల ఖండన

కందుకూరు, జూలై 27 (ఆంధ్రజ్యోతి): కరేడు బలవంతపు భూసేకరణకు వ్యతిరేకంగా జరుగుతున్న ఉద్యమంలో పాల్గొన్న సీపీఎం ఉలవపాడు ప్రాంతీయ కమిటీ కార్యదర్శి జీవీబీ కుమార్‌ను ఆదివారం తెల్లవారుజామున పోలీసులు అరెస్టు చేసి అదుపులోకి తీసుకున్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అజయ్‌కుమార్, గుడ్లూరు, కందుకూరు సీపీఎం ఏరియా కమిటీ కార్యదర్శులు జీ వెంకటేశ్వర్లు, ఎస్‌ఏ గౌస్‌లు పోలీసుల చర్యలను ఖండించారు.

బోర్డు అనుమతిచ్చిన మేరకే పొగాకు సాగుచేయాలి



రైతులకు సూచనలు ఇస్తున్న బోర్డు సిబ్బంది

కలిగిరి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): పొగాకు సాగుపై నియంత్రణ పాటించి రానున్న పంట సీజన్ 2025-26 కాలానికి సంబంధించి బోర్డు అనుమతిచ్చిన మేరకే పొగాకు సాగుచేయాలని వేలం నిర్వహణ అధికారి శివకుమార్ రైతులకు సూచించారు. ఆదివారం వేలం కేంద్రం పరిధిలోని కలిగిరి, కొండాపురం, దుత్తలూరు మండలాల్లోని రైతులకు పొగాకు సాగుపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా రైతులతో మాట్లాడుతూ అధిక ధరలకు పొగాకు బ్యారన్లను, భూములను కౌలుకు తీసుకొని నష్టపోవద్దని సూచించారు. ఈకార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ సంతోష్‌కుమార్, బోర్డు సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

కందుకూరు, జూలై 27 (ఆంధ్రజ్యోతి): కందుకూరు- సింగరాయకొండ హైవేపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందింది. కందుకూరు రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు ... కందుకూరు పట్టణం ఖాజీపాలెంకు చెందిన పఠాన్ సాజిద (53) ఆమె కుమారుడు షాబిన్ కారులో ఒంగోలుకు వెళుతున్నారు. మార్గ మధ్యంలో రవి గార్డెన్స్ సమీపంలో ముందుగా వెళుతున్న లారీని ఓవర్ టేక్ చేసే క్రమంలో లారీని ఢీకొనడంతో సాజిదకు తీవ్ర గాయాలు కాగా, కారు నడుపుతున్న కుమారుడికి స్వల్ప గాయాలు అయ్యాయి. సాజిదను ఒంగోలు రిమ్స్‌కు తరలించే క్రమంలో మార్గమధ్యంలో మృతి చెందింది. మృతురాలు సాజిద దొనకొండ కాలేజీలో హిందీ అధ్యాపకురాలిగా విధులు నిర్వహిస్తోంది. ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్సై మహేంద్రనాయక్ తెలిపారు.

ప్రతీ కుటుంబానికి సంక్షేమ పథకాలు



కందుకూరు : కరపత్రాలు అందచేస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి



వరికుంటపాడు : కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాకర్ల

కందుకూరు, జూలై 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా ముఖ్యమంత్రి చంద్ర బాబునాయుడు పాలన సాగిస్తున్నారని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు. పట్టణంలోని 31వ వార్డు కోవూరు రోడ్డులో సాయినగర్ 1వ లైన్ తదితర ప్రాంతాల్లో ఆదివారం సాయంత్రం సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం అమలు చేసిన, చేయబోతున్న సంక్షేమ పథకా లను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. వార్డుల్లో ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు దామా మల్లేశ్వరరావు, అత్తంటి శివకృష్ణ, పిడికిటి వెంకటేశ్వర్లు, శ్రీనివా సులు, వెంకటకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

సీఎం సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తన కార్యాలయంలో లబ్ధిదారులకు ఆదివారం అందచేశారు. ముగ్గురు లబ్ధిదారులకు కలిపి రూ.1,08,422 చెక్కులు అందించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు మనోహర్, పర్వతాలు, వెంకటేశ్వర్లు, కొండప నాయుడు తదితరులు పాల్గొన్నారు.

● **వరికుంటపాడు(ఉదయగిరి రూరల్) :** టీడీపీ హయాంలోనే అన్నిరంగాల్లో అభివృద్ధి సాధ్యమవుతుందని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ అన్నారు. ఆదివారం రాత్రి మండలంలోని నార్తుకొండాయపాళెంలో నిర్వహించిన సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభించడంతో పాటు ఏడాది పాలనపై కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ చంద్ర మధుసూదన్‌రావు, ప్రధాన కార్యదర్శి పోలుబోయిన శ్రీకాంత్‌యాదవ్, జడ్పీటీసీ రావిళ్ల నాగేంద్ర, వైస్ ఎంపీపీ దేవనబోయిన మధు, టీడీపీ నాయకులు ముజ్జే లక్ష్మీనారాయణ, తెల్లగొర్ల వెంకటయ్య, నాదిండ్ల రాజేంద్ర, పొద మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేత సుబ్బారెడ్డి మృతికి ప్రముఖుల సంతాపం

ఉలవపాడు, జూలై 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ ఏఎంసీ డైరెక్టర్ మల్లవరపు సుబ్బారెడ్డి అనారోగ్యంతో శనివారం రాత్రి మృతిచెందగా ఆదివారం పార్టీలకు అతీతంగా మండలంలోని పలువురు ఆయన మృతికి సంతాపం తెలిపారు. మధ్యాహ్నం కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సుబ్బారెడ్డి పార్థీవ దేహాన్ని సందర్శించి ఘన నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. అదేవిధంగా మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దివి శివరాం సుబ్బారెడ్డి మృతిపట్ల సంతాపం తెలిపి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

అప్రకటిత విద్యుత్ కోతలతో జనం వెతలు

వలేటివారిపాలెం, జూలై 27 (ఆంధ్రజ్యోతి): మండలంలో గత కొన్ని రోజులుగా అప్రకటిత విద్యుత్ కోతలతో జనం అల్లాడిపోతున్నారు. విద్యుత్ ఎప్పుడు ఉంటుందో ఎప్పుడు పోతుందో తెలియక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చిన్నపాటి వర్షం కురిసినా విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నారు. కాలం చెల్లిన ట్రాన్స్‌ఫార్మర్లతోనే ఇటువంటి సమస్యలు వస్తున్నాయని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రమైన వలేటివారిపాలెంలో నాలుగైదు రోజులకోసారి ఎక్కడో ఒకచోట ఓవర్‌లోడుతో ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతూనే ఉన్నాయి. దీంతో గంటల తరబడి విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి వేళలో పరిస్థితి మరితం దారుణంగా ఉంటోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా, విద్యుత్‌ను నమ్ముకొని వ్యాపారాలు చేసుకొనే చిన్న వ్యాపారులు విద్యుత్ కోతల కారణంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా రైస్‌మిల్లులు, పిండిమిల్లులు, వాటర్‌ప్లాంట్‌లు, వాటర్ సర్వీసింగ్, ఫోటో స్టూడియోలు, జెరాక్స్ సెంటర్లు, టైలరింగ్ తదితర వ్యాపారస్తులు విద్యుత్ కోతలు కారణంగా తమ ఆదాయాన్ని కోల్పోతున్నారు. విద్యుత్ కోతలకు తోడు లోఓల్టేజీ సమస్యతో ఇంట్లో ఉన్న ఎలక్ట్రికల్ వస్తువులు మరమ్మతులకు గురవుతున్నాయని, ఇప్పటికైనా అధికారులు స్పందించి విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని వినియోగదారులు కోరుతున్నారు.

స్మార్ట్ మీటర్లపై పోరుబాట కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాలు విడుదల చేస్తున్న వామపక్ష పార్టీ నాయకులు

కందుకూరు, జూలై 27 (ఆంధ్రజ్యోతి): అదానీ స్మార్ట్ మీటర్లపై పోరుబాట కరపత్రాలను వామపక్ష పార్టీ ఆధ్వర్యంలో స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆదివారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బీ సురేష్, సీపీఐ ఎంఎల్ న్యూ డెమొక్రసీ నాయకులు కే మోహన్‌రావు, అఖిలభారత రైతుకూలి సంఘం రాష్ట్ర నాయకులు కే నాంచార్లు, సీపీఎం పట్టణ కార్యదర్శి ఎస్‌ఏ గౌస్, రాయుడు పాల్గొన్నారు.

నేటి తరానికి అబ్దుల్ కలాం ఆదర్శం



బిట్రగుంట: అబ్దుల్ కలాం విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బీఎంఆర్ యువసేన నాయకులు

బిట్రగుంట, జూలై 27 (ఆంధ్రజ్యోతి): నేటి తరం మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాంను ఆదర్శంగా తీసుకోవాలని బీఎంఆర్ యువసేన అధ్యక్షుడు షేక్ సమీఉల్లా అన్నారు. బోగోలు మండలం విశ్వనాథరావుపేట పంచాయతీ ఇబ్రహీంపేటలో దివంగత ఏపీజే అబ్దుల్‌కలాం వర్ధంతి సందర్భంగా ఆదివారం ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో స్థానికులు సాతుపాటి ఉదయ్‌కుమార్, ఎంఏ బేగ్, పీ షకీల్, వేణు, అహ్మద్‌బాషా, దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

●**కావలి :** ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా ఆదివారం కావలి రెడ్‌క్రాస్ భవనంలో ఆయనకు నివాళులు అర్పించి సభ్యులు రక్తదానం చేశారు. ఈసందర్భంగా ట్రస్ట్ వ్యవస్థాపకులు పఠాన్ ఖాదర్‌బాష మాట్లాడుతూ అబ్దుల్‌కలాం భారతదేశాన్ని అణుశక్తితో రక్షణపరంగా తిరుగులేని శక్తిగా మలిచారన్నారు. అనంతరం పలువురు సభ్యులు రక్తదానం చేశారు. ఈకార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ డీ రవిప్రకాష్, జూనియర్ రెడ్‌క్రాస్ కన్వీనర్ గాదిరెడ్డి హరినాథ్, ప్రసన్న, అభ్యుదయ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు శ్రీకాంత్, శ్రీను, కిరణ్, అశోక్, సుభానీ, రాజు, వెంకటేశ్వర్లు, వసంత్, రెడ్‌క్రాస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పట్టుదలతో చదివి మంచి మార్కులు సాధించాలి



విద్యార్థులను సన్మానిస్తున్న బిట్రగుంట వాకర్స్ సభ్యులు

బిట్రగుంట, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి పట్టుదలతో చదివి మంచి మార్కులు సాధించాలని జడ్పీ స్కూల్ హెచ్‌ఎం గంగాధరరావు సూచించారు. బిట్రగుంట రైల్వే ఫుట్‌బాల్ క్రీడామైదానంలో వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బీ. బర్నాడ్ ఆధ్వర్యంలో పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు సన్మాన కార్యక్రమం ఆదివారం జరిగింది. అసోసియేషన్ మాజీ ట్రెజరర్ పీ జీవన్‌కుమార్ విద్యార్థులకు మెమొంటోలు అందచేశారు. తైక్వోండో విద్యార్థి నూకసాని కౌశిక్ పుట్టినరోజు సందర్భంగా క్రీడాకారులకు పౌష్టికాహారాన్ని ఎన్ఎస్‌యాదవ్ అందచేశారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, బీజేపీ మండల అధ్యక్షుడు వీరాల శ్రీనివాసులు యాదవ్, ప్రైవేట్ పాఠశాలల నిర్వాహకులు, విద్యార్థుల తల్లితండ్రులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ బాధితురాలికి చేయూత



క్యాన్సర్ బాధితురాలికి నగదు, నిత్యావసరాలు అందచేస్తున్న సంయుక్త సేవా సంస్థ బాధ్యులు

కావలి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): క్యాన్సర్‌తో బాధపడుతున్న కావలి రూరల్ మండలం చెన్నాయపాలెంకు చెందిన శ్రీవాణి గత మూడు సంవత్సరాలుగా మంచానికే పరిమితం కావడంతో ఆమె కుటుంబాన్ని ఆదుకునేందుకు సంయుక్త సేవా సంస్థ నగదు, నిత్యావసరాలు వితరణగా అందచేసింది. సంస్థ బాధ్యులు ఆదివారం చెన్నాయపాలెం వెళ్లి ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు. సంయుక్త సేవాసంస్థ సభ్యులు, గురువులు, శిష్యుల సహకారంతో రూ.13 వేలు, సేవాసంస్థ నెలవారీ చందాదారుల సహకారంతో రూ.5వేల విలువచేసే నిత్యావసరాలు, బియ్యం అందచేశారు. ఈ కార్యక్రమంలో సంయుక్త సేవాసంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర, సీనియర్ సభ్యులు ఎంవీఎన్ ప్రసాద్‌రావు, షేక్ ఖాదర్‌బాష, పీ. జాఫర్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పాల పొంగళ్లు

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), జూలై 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాంచెరువులో వెలసి ఉన్న పోలేరమ్మతల్లికి భక్తులు ఆదివారం భక్తిశ్రద్ధలతో పాల పొంగళ్ల కార్యక్రమం చేశారు. ఈ సందర్భంగా నివాసాల నుంచి పొంగళ్ల సామగ్రిని ఊరేగింపుగా ఆలయానికి చేర్చి పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు పెట్టి నైవేద్యాలను పంచి పెట్టారు. అనంతరం అమ్మవారిని అలంకరించి మేళతాళాలు, బాణాసంచా నడుమ గ్రామోత్సవం నిర్వహించారు.

ఆశ్రమానికి చిరుద్యోగి చేయూత

అనంతసాగరం, జూలై 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కామిరెడ్డిపాడు ఉన్నత పాఠశాలలో చిరు ఉద్యోగి చేరుకూరి మనోజ్ కుమార్, వారి కుటుంబసభ్యులు ఆదివారం రాజుపాలెంలోని విశ్వజననీ బాలా ఆశ్రమానికి దుస్తులు, నిత్యవసర సరుకులు, తినుబండారాలు అందజేశారు. దీంతో వారిని ఆశ్రమ నిర్వాహకులు అభినందించారు.

ముందుగానే నిత్యావసర సరుకుల పంపిణీ



సరుకులు అందజేస్తున్న డీలర్ ఫయాజ్

ఉదయగిరి, జూలై 27(ఆంధ్రజ్యోతి): వృద్ధులు, దివ్యాంగులకు పౌర సరఫరాల శాఖ ముందుగానే నిత్యాసర సరుకుల పంపిణీని ప్రారంభించింది. రాష్ట్ర ప్రభుత్వం వృద్ధులు, దివ్యాంగులకు ప్రతినెలా 26 నుంచి 30వ తేదీ వరకు డీలర్లు ఇంటికెళ్లి నిత్యావసర వస్తువులు పంపిణీ చేయాలని నిర్ణయించింది. అందులో భాగంగా పట్టణంలోని పలువురు చౌక దుకాణాల డీలర్లు ఆదివారం నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు.

కొనసాగిన ఎన్‌ఎంయూఏ ఉద్యోగుల నిరసన



ఆర్టీసీ డిపో ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఎన్‌ఎంయూఏ ఉద్యోగులు

ఉదయగిరి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ డిపో ఎదుట రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రెండో రోజైన ఆదివారం ఎన్‌ఎంయూఏ ఉద్యోగులు ఎర్రబ్యాడ్జీలు ధరించి నిరసన చేశారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యోగులు మాట్లాడుతూ ఆర్టీసీ స్థలాలను ప్రైవేటు సంస్థకు అప్పగించే నిర్ణయాన్ని ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో ఎన్‌ఎంయూఏ నాయకులు, ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పెంచలస్వామి ఆరాధన మహోత్సవం



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ఆత్మకూరు, జూలై 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేపూరు గ్రామ సమీపంలోని హనుమాన్ జంక్షన్ వద్ద ఆదివారం హనుమాన్‌భక్త శ్రీ పెంచలస్వామి ఆరాధన మహోత్సవం ఘనంగా నిర్వహించారు. పెంచలస్వామి, సాయిబాబా, అంజనేయస్వామి, వెంకయ్యస్వామి, రామలక్ష్మణులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధికసంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమాలలో నిర్వాహకులు భాస్కర్‌నాయుడు, పెంచల నాయుడు, గ్రామ సర్పంచ్ రావిళ్ల వెంకటేశ్వర్లు, ఉపసర్పంచ్ కన్నం వెంకటసుబ్బయ్య, దొడ్ల సుమన్, కొల్లా ఆదిశేషయ్య, తూమాటి తిరుపతి, పిడికిటి వెంకటేశ్వర్లునాయుడు, కొల్లి ఆదిశేషయ్య, వీరపునేని, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పిల్లల సంరక్షణలో స్త్రీ పాత్ర కీలకం



మాట్లాడుతున్న తెలుగు ఉపాధ్యాయురాలు డాక్టర్ వేలూరు భారతి

ఆత్మకూరు, జూలై 27 (ఆంధ్రజ్యోతి): పిల్లల సంరక్షణలో స్త్రీ పాత్ర అత్యంత కీలకమైనదని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయురాలు డాక్టర్ వేలూరు భారతి తెలిపారు. తెలుగు భారతి సేవా సమితి ఆధ్వర్యంలో ప్రతి నెలా మంచిమాట కార్యక్రమంలో భాగంగా మానవ పరిణామక్రమంలో స్త్రీ పాత్ర అనే అంశంపై ఆదివారం ఆత్మకూరు పట్టణంలో సెమినార్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మానవజాతి కొనసాగింపు, సమాజ నిర్మాణం, సంస్కృతి పరిరక్షణలో స్త్రీ కీలకపాత్ర పోషిస్తుందని తెలిపారు. అయినా ఇప్పటికీ స్త్రీలు వివక్షకు గురవుతన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుభారతి సేవా సమితి అధ్యక్షుడు సోమవరపు యానాదిరెడ్డి, గౌరవాధ్యక్షుడు ఏ గోవిందరెడ్డి, సహాధ్యక్షుడు కొల్లా వెంకటేశ్వర్లు, ప్రచార కార్యదర్శి కె రవీంద్రకుమార్, గౌరవ సలహాదారులు ఎస్‌వీ రమణయ్య, కెవి శేషారెడ్డి, వెలిశెట్టి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

నాగారపమ్మకు ప్రత్యేక పూజలు



నాగారపమ్మను దర్శించుకుంటున్న భక్తులు

సంగం, జూలై 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోలగట్ల పెన్నానది ఒడ్డున ఉన్న పురాతన నాగారపమ్మదేవి ఆలయంలో శ్రావణ మాసం తొలి ఆదివారం పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా పెన్నానది జలాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం పూలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన మహిళా భక్తులు పొంగళ్లు పొంగించి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో మధ్యాహ్నం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

దువ్వూరమ్మకు ప్రత్యేక పూజలు

సంగం, జూలై 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దువ్వూరులో ఉన్న దువ్వూరమ్మ గ్రామదేవతకు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం మహిళలు అమ్మవారికి అభిషేకాలు, కుంకుమ పూజ, పల్లకీసేవ నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

త్రైత సిద్ధాంత ఆధ్యాత్మిక గ్రంథాల ప్రచారం



త్రైత సిద్ధాంత ఆధ్యాత్మిక గ్రంథాలపై ప్రచారం చేస్తున్న ఇందూజ్ఞాన వేదిక దుత్తలూరు కమిటీ సభ్యులు

సీతారామపురం, జూలై 27 (ఆంధ్రజ్యోతి): త్రైతసిద్ధాంత ప్రబోధసేవా సమితి ఇందూజ్ఞాన వేదిక దుత్తలూరు కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం మండల కేంద్రంలో త్రైత సిద్ధాంత ఆధ్యాత్మిక గ్రంధముల ఇందూ ధర్మ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీకృష్ణ భగవానుడికి మాత్రమే ఊరేగింపు చేయాలి. శ్రీకృష్ణ పరమాత్మ ఊరేగింపు చేసిన గ్రామంలో ప్రకృతి వైపరీత్యాలు, రోగ బాధలు ప్రజలకు ఉండవని పూర్వం పెద్దలు చెప్పేవారన్నారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు జీ. ప్రసాద్, పెంచల రత్నం, సుధాకర్, నరసింహులు, నాగమ్మ, మధు, రమణారెడ్డి పాల్గొన్నారు.

మెగా జాబ్‌మేళా పోస్టర్ ఆవిష్కరణ



మెగా జాబ్‌మేళా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి

చేజర్ల, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ఆత్మకూరులో ఆగస్టు 1, 2వ తేదీలలో నిర్వహించనున్న మెగా జాబ్‌మేళా పోస్టర్‌ను ఆదివారం చేజర్ల మండలంలోని పెరుమాళ్ళపాడు సమీపంలో ఉన్న వ్యవసాయ క్షేత్రంలో రాష్ట్ర దేవదాయ ధర్మా దాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి విడుదల చేశారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర స్కిల్‌డెవలప్‌మెంట్ కార్పోరేషన్ ఆధ్వర్యం లో మంత్రి నారా లోకేష్ సహకారంతో జరిగే జాబ్‌మేళాకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ జాబ్‌మేళాలో 1200 నుంచి 1500 వరకు నిరుద్యోగ యువతకు అర్హతల మేరకు అక్కడికక్కడే నియామక పత్రాలు అందజేయను న్నట్లు తెలిపారు. ఆత్మకూరు నియోజకవర్గంలో ఐటిఐ, పాలిటెక్నిక్, ప్రయి వేటు ఇంజనీరింగ్ కళాశాలల్లో సాంకేతిక విద్యనభ్యసించి ఖాళీగా ఉన్న ప్రతి ఒక్కరికీ ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించడమే జాబ్‌మేళా ధ్యేయం అన్నారు. అదేవిధంగా సోమవారం చేజర్ల మండలంలోని కోటితీర్థం గ్రామంలో ఉదయం కోటీశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం టి.కే.పాడు గ్రామంలో రాష్ట్ర దేవదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో పాల్గొంటారని టిడిపి మండలాధ్యక్షుడు షేక్ సిరాజుద్దీన్ తెలిపారు. ఈ కార్యక్రమానికి మండలంలోని టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

అబ్దుల్‌కలాంకు ఘన నివాళులు



అబ్దుల్‌కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

ఉదయగిరి, జూలై 27(ఆంధ్ర జ్యోతి): స్థానిక వైసీపీ కార్యాలయంలో ఆది వారం వైసీపీ మండల కన్వీనర్ కొండా రాజగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో భారత రత్న, మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్‌కలాం వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ దేశం కోసం ఆయన చేసిన సేవలను కొనియాడారు. ప్రతిఒక్కరూ అలాంటి మహనీయు లను ఆదర్శంగా తీసుకుని దేశం కోసం పాటుపడాలన్నారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైసీపీ నా యకులు కల్లూరి వెంకటేశ్వరరెడ్డి, రమణారెడ్డి, అక్కి భాస్కర్‌రెడ్డి, దస్తగిరి అహ్మద్, షంషీర్, వీరారెడ్డి, సలీం, బాబు, దారపనేని చెన్నయ్య పాల్గొన్నారు.

వైద్యఖర్చులకు ఆర్థికసాయం

ఉదయగిరి, జూలై 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీ.చెరువుపల్లి గ్రామానికి చెందిన తమ్ములూరి చినపెం చలయ్య రోడ్డు ప్రమా దంలో తీవ్రంగా గాయపడి చెన్నై విజయ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండ డంతో ఆదివారం జనసేన పార్టీ సమన్వయకర్త కొట్టే వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేశారు. అలాగే పెంచలయ్య ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పార్టీ తరపున రూ.10 వేలు, న్యాయవాది కాకు మురళీకృష్ణ బార్ అసోసియేషన్ తరపున రూ.10 వేలు అందజేశారు. పెంచ లయ్య పరిస్థితిని జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లి కుటుం బాన్ని ఆదుకునేలా చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు అనంతశెట్టి ఏడుకొండలు, అల్లూరి రవీంద్ర, కల్లూరి సురేంద్రరెడ్డి, కిరణ్, శ్రీనివాసులు, రసూల్, రవికుమార్, కుర్రా కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు : సీఐ



ద్విచక్ర వాహనదారులకు సూచనలు ఇస్తున్న సీఐ గంగాధర్

ఆత్మకూరు, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : నిబంధనలు అతిక్రమించి వాహనాలను నడిపితే చర్యలు తప్పవని సీఐ జి గంగాధర్ తెలిపారు. ఆదివారం ఆత్మకూరు పట్టణంలో సీఐ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్తుపానీయాలు సేవించి, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ వాహనాలను నడపకూడదని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. మోటారు బైకులపై ఇదరికి మించి ప్రయాణించడం నిబంధనలు అతిక్రమించడమేనని హెచ్చరించారు. రోడ్డు మలుపుల వద్ద జాగ్రత్తలు పాటించాలని, అతి వేగంగా వాహనాలు నడపకూదని సూచించారు. వాహనదారులు తమ వాహనానికి సంబంధించిన లైసెన్స్‌లు, డ్రైవింగ్ లైసెన్స్ తమ వద్ద ఉంచుకోవాలన్నారు. ద్విచక్రవాహనదారుకు రోడ్డు భద్రత నిబంధనలను వివరించారు. అప్రమత్తతతోనే రోడ్డు ప్రమాదాల నివారణ సాధ్యమని తెలిపారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5



తిరుపతి
జిల్లా వార్తలు
సోమవారం 28 జూలై 2025

భక్తులతో కలిసి..

● వెంకయ్య నాయుడు అన్నప్రసాదాల స్వీకరణ



శ్రీవారి దర్శనార్థం తిరుమల చేరుకున్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడికి క్యాపీ అతిథి గృహం వద్ద టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి స్వాగతం పలికారు. కాసేపు విశ్రాంతి అనంతరం వెంకయ్య నాయుడు మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద భవనానికి వెళ్లి భక్తుల మధ్య కూర్చుని అన్నప్రసాదాలు స్వీకరించారు. టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి అన్నప్రసాదాల వితరణ గురించి వెంకయ్యనాయుడికి వివరించారు. అనంతరం శ్రీవారిసేవకులతో పాటు అన్నప్రసాదాలు స్వీకరించేందుకు వచ్చిన భక్తులతోనూ వెంకయ్య నాయుడు ముచ్చటించారు. అన్నప్రసాదాలపై తన అభిప్రాయాన్ని కామెంట్ పుస్తకంలో రాశారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

స్వామి దర్శనానికి గవర్నర్



గవర్నర్‌కు స్వాగతం పలుకుతున్న టీటీడీ ఈవో

శ్రీవారి దర్శనానికి గవర్నర్ అబ్దుల్ నజీర్ కుటుంబ సమేతంగా ఆదివారం తిరుమల వచ్చారు. పద్మావతి అతిథి గృహం వద్ద టీటీడీ ఈవో శ్యామలరావు స్వాగతం పలికారు. ఉదయం 10 గంటలకు ఆలయం వద్ద గవర్నర్‌కు టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, అధికారులు, అర్చకబృందం ఇస్తికఫాల్ స్వాగతం పలికారు. అనంతరం స్వామిని దర్శించుకుని తిరుగు ప్రయాణమయ్యారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

శ్రీవారి సేవలో సీఎస్



తిరుమలేశుడిని ఆదివారం ఉదయం వీఐపీ బ్రేక్‌లో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ దర్శించుకున్నారు. రంగనాయక మండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేయగా, ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి శ్రీవారి తీర్థప్రసాదాలు, డైరీ, క్యాలెండర్, శ్రీవారి చిత్రపటాన్ని బహూకరించారు. ఆలయ పరిసర ప్రాంతాల్లో చేపడుతున్న అభివృద్ధి పనుల గురించి ఈవో, అదనపు ఈవో వివరించారు. తిరుమలలోని చైర్మన్ కార్యాలయానికి వెళ్లిన విజయానంద్ బీఆర్ నాయుడితో వివిధ అంశాలపై చర్చించారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

మరో ప్రయోగానికి షార్ సిద్ధం



రాకెట్‌లోని మొదటి దశ

- రాకెట్: జీఎస్ఎల్వీ-ఎఫ్ 16
- పొడవు: 50.9 మీటర్లు
- ఉపగ్రహం: నిసార్
- బరువు: 2,392 కిలోలు
- ప్రయోగ సమయంలో రాకెట్ బరువు: 420.7 టన్నులు
- రాకెట్ ఎగిరేది: 30వ తేది సాయంత్రం 5.40 గంటలకు



రెండో దశ



మూడు దశల అనుసంధానంతో జీఎస్ఎల్వీ-ఎఫ్ 16 రాకెట్



మూడో దశ



ఉష్ణ కవచం ఏర్పాటు దశలో.. ఏర్పాటు చేశాక నిసార్ ఉపగ్రహం



అనుసంధానం అనంతరం వ్యాబ్ నుంచి ప్రయోగ వేదికకు తరలిస్తున్న జీఎస్ఎల్వీ-ఎఫ్ 16 రాకెట్

మరో ప్రయోగానికి షార్‌లోని రెండో ప్రయోగ వేదిక సిద్ధమైంది. ఇస్రో-నాసా సంయుక్తంగా రూపొందించిన నిసార్ ఉపగ్రహాన్ని జీఎస్ఎల్వీ-ఎఫ్ 16 రాకెట్ ద్వారా అంతరిక్షంలోకి పంపేందుకు శాస్త్రవేత్తలు సర్వం సిద్ధం చేశారు. పీఎస్ఎల్వీ రాకెట్‌ను నాలుగు దశల్లో ప్రయోగిస్తే.. దీనిని మూడు దశల్లోనే ప్రయోగిస్తారు. వ్యాబ్‌లో రాకెట్ మూడు దశల అనుసంధానం పూర్తిచేసి రాకెట్ శిఖర భాగాన ఉపగ్రహాన్ని అమర్చారు. ప్రయోగ వేదిక పైఉన్న రాకెట్‌కు లెవల్-1, లెవల్-2 తనిఖీలు పూర్తిచేసి ప్రీ కౌంట్‌డౌన్ నిర్వహించి రిహార్సల్‌ను విజయవంతంగా నిర్వహించారు. రాకెట్ దశల వారీగా అనుసంధానించే చిత్రాల దృశ్యాలను ఇస్రో ఆదివారం విడుదల చేసింది.

ప్రయోగ దశలిలా.

మొదటి దశ: రాకెట్ మొదటి దశ నాలుగు స్ట్రాపాన్ ద్రవ ఇంధన బూస్టర్ల సాయంతో ప్రారంభమవుతుంది. ఒక్కో స్ట్రాపాన్ బూస్టర్‌లో 42.675 టన్నుల ద్రవ ఇంధనం నింపుతారు. కోర్ అలోన్ దశలో 138.1 ఘన ఇంధనంతో మొదటి దశను ఘన, ద్రవ ఇంధనాల మిళితంతో 151.2 సెకన్లలో పూర్తి చేస్తారు. కోర్ అలోన్ దశతో కలిపి 308.5 టన్నుల ద్రవ, ఘన ఇంధనంతో కలగలిపి మొదటి దశ పూర్తవుతుంది.

రెండో దశ: 42.15 టన్నుల ద్రవ ఇంధన సాయంతో రెండో దశను 289.56 సెకన్లలో పూర్తి చేస్తారు.

మూడో దశ (క్రయోజనిక్ దశ): ఈ దశ అత్యంత కీలకం. క్రయోదశలో 14.96 టన్నుల క్రయోజనిక్ ఇంధనం సాయంతో 1106.60 సెకన్లకు మూడో దశను కటాఫ్ చేస్తారు.

ఆ తరువాత జీఎస్ఎల్వీ- ఎఫ్ 16 ఉపగ్రహ వాహక నౌక ద్వారా నిసార్ ఉపగ్రహాన్ని 1115.60 సెకన్లకు (18.59 నిమిషాలు) భూమికి 745 కిలోమీటర్ల ఎత్తులో.. 98.6 డిగ్రీల ఏటవాలులో సూర్య సమకాలిక కక్ష్యలోకి ప్రవేశపెట్టనున్నారు. అక్కడ్నుంచి ఉపగ్రహాన్ని బెంగళూరులోని హసన్‌లో ఉన్న మాస్టర్ కంట్రోల్ సెంటర్ వారు తమ అధీనంలోకి తీసుకుని నియంత్రిస్తారు.

- సూళ్లూరుపేట, ఆంధ్రజ్యోతి

ఎలాగైనా అక్కడ పోస్టింగ్ ఇప్పించండి

● స్పెషల్ బ్రాంచిలోకి మళ్లీ రావడానికి పోలీసుల పోటీ

● ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల ద్వారా ఒత్తిళ్లు

గ్రావెల్.. స్థానికంతో పాటు తమిళనాడుకు, బియ్యం.. కాకినాడ, కృష్ణపట్నం పోర్టులకు, ఇసుక.. జాతీయ రహదారిపైనే దర్జాగా తమిళనాడుకు అక్రమ రవాణా అవుతున్నాయి. ఇక, సిలికా, క్వార్ట్జ్ ఉండనే ఉన్నాయి. అందుకనే గూడూరు నుంచి తడ, సత్యవేడు వరకున్న పోలీసు స్టేషన్ల పరిధిలో స్పెషల్ బ్రాంచి (ఎస్‌బీ)లో పనిచేసేందుకు ఎక్కువ మంది పోటీపడుతున్నారు. వైసీపీ ప్రభుత్వంలో అడ్డదిడ్డంగా పనిచేసి.. బదిలీ అయిన వారు.. పక్కన పెట్టిన వారూ ప్రజాప్రతినిధులు, తమకు తెలిసిన ఐఏఎస్, ఐపీఎస్ ఉన్నతాధికారుల ద్వారా ప్రస్తుతం ఖాళీగా ఉన్న మూడు పోస్టుల కోసం లాబీయింగ్ చేసుకుంటున్నట్లు తెలుస్తోంది.

ఇటీవల ఎస్పీ హర్షవర్ధనరాజు స్పెషల్ బ్రాంచిని భారీ ప్రక్షాళన చేశారు. ఇందులో కొన్ని స్థానాలకు సబ్ డివిజన్ స్థాయి అధికారులు నియమించుకున్నారు. ప్రస్తుతం సూళ్ళూరుపేట, వెంకటగిరి, సత్యవేడు ప్రాంతాల్లో ఎస్బీ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ మూడు ప్రాంతాలకు కలిపి హెడ్ కానిస్టేబుళ్లుగా రావడానికి పలువురు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. గతంలో ఇక్కడ పనిచేసి వారూ.. మళ్లీ ఇదే స్థానాలకు రావడానికి ఉవ్విళ్లూరు తున్నారు. ఎందుకంటే వైసీపీ ప్రభుత్వంలో బాగా ఆదాయ వనరులున్న ప్రాంతాలుగా నాయుడుపేట, గూడూరు, సూళ్లూరుపేట, సత్యవేడు పేరుపడ్డాయి. ఇసుక నుంచి బియ్యం వరకు ఇలా ఎన్నో అక్రమ రవాణాలకు ఈ ప్రాంతాలు నెలవు. ఈ క్రమంలో తమ పరిధిలో జరిగే ఇలాంటి అక్రమ రవాణాలు, ఇతరత్రా అసాంఘిక కార్యకలాపాలతో పాటు పోలీసు అధికారులు, సిబ్బంది పనితీరుపైనా ఎస్బీలో పనిచేసేవారు నేరుగా ఎస్పీకి రిపోర్టు చేయాల్సి ఉంటుంది. ఇలాంటి సమాచారాన్ని తొక్కిపెడితే అక్రమార్కుల నుంచి ఆయా పోలీసు స్టేషన్లలో పనిచేసే కొందరు అధికారులు వీరిని 'బాగా చూసుకుంటారు'. గతంలో భారీగా లబ్ధి పొందిన వీరంతా మళ్లీ ఈ స్థానాల్లోకి వచ్చేందుకు ప్రజాప్రతినిధులతో పాటు కొందరు ఉన్నతాధికారులతోనూ లాబీయింగ్ చేసుకుంటున్నారు. దీనిపై ఎస్పీ ఎలా స్పందిస్తారో వేచి చూడాలి.

- తిరుపతి (నేరవిభాగం), ఆంధ్రజ్యోతి

ముక్కంటికి బంగారు వజ్రాల నెక్లెస్ వితరణ

శ్రీకాళహస్తి, జూలై 27(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామికి ఆదివారం పట్టణానికి చెందిన శ్రీహరి శంకర్ అవధాని, పద్మావతి 90.680 గ్రాముల బరువైన రూ.12లక్షల విలువ చేసే వజ్రాల నెక్లెస్‌ను వితరణ చేశారు. దీన్ని ఈవో బాపిరెడ్డి స్వీకరించి దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. స్వామి అమ్మవార్ల దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామిఅమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.



ఈవోకు నెక్లెస్ అందిస్తున్న దాత

కోట పీఈటీ సస్పెన్షన్

● హెచ్ఎం భారతికి షోకాజ్ నోటీసు జారీ

తిరుపతి(విద్య)/కోట, జూలై 27(ఆంధ్రజ్యోతి): కోట జడ్పీ బాలిక పాఠశాల విద్యార్థులపట్ల అమానవీయంగా ప్రవర్తించి, వారి అనారోగ్యానికి కారణమైన వ్యాయామ ఉపాధ్యాయుడు సుభాన్ (మాబాష)ను డీఈవో కేవీఎన్ కుమార్ సస్పెండ్ చేశారు. ఎస్సీ బాలికల వసతిగృహానికి చెందిన 60 మంది విద్యార్థినులు వైట్ యూనిఫాం వేసుకొని రాలేదని 150 గుంజిళ్లు తీయించి, బెత్తంతో విచక్షణారహితంగా కొట్టడంతో వారు అనారోగ్యం బారినపడి ఆసుపత్రి పాలైన విషయం తెలిసిందే. ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించిన డీఈవో, వ్యాయామ ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేస్తూ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే ఇంతటి తీవ్రమైన విషయాన్ని తక్షణం పైఅధికారులకు తెలియకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకుగాను పాఠశాల ప్రధానోపాధ్యాయిని భారతికి షోకాజ్ నోటీసులు జారీ చేసినట్టు డీఈవో తెలిపారు. కాగా వ్యాయామ ఉపాధ్యాయుడు సుభాన్‌పై మూడు సెక్షన్లతో కూడిన కేసులు నమోదు చేసినట్లు వాకాడు సీఐ హుస్సేన్‌బాషా తెలిపారు. మరోవైపు వసతిగృహంలోని విద్యార్థినులను ఆదివారం తెల్లవారుజామునుంచే అధికారులు, ప్రజాసంఘాలు పలు పార్టీల నాయకులు పరామర్శిస్తున్నారు. గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీన దంపతులు,



విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

గూడూరు డీఎస్పీ గీతాకుమారి, సీఐ హుస్సేబాషా తెల్లవారుజాము వరకు వసతిగృహంలోనే ఉంటూ విద్యార్థినులకు వైద్య సేవలు అందించారు. ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ రెండు గంటలపాటు విద్యార్థినులు, వారి తల్లిదండ్రులతో మాట్లాడి ఓదార్చారు. ఈ ఘటనపై కలెక్టర్, డీఈవోలకు ఎమ్మెల్యే ఫోన్ చేసి తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. బీజేపీ, విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు, దళిత సంఘాలు, వైసీపీ విద్యార్థి సంఘం నాయకులు, టీడీపీ, టీఎంఎస్ఎఫ్ నాయకులు విద్యార్థినులను పరామర్శించారు. పీడీపై పోక్సో కేసు నమోదు చేయాలంటూ పోలీసుల ఎదుట ఆందోళన చేపట్టారు. సాంఘిక సంక్షేమశాఖ జీడీ విక్రమ్‌కుమార్‌రెడ్డి, తహసీల్దారు జయజయరావు, ఎంఈవో మస్తానయ్య, శైలజ విద్యార్థినులను పరామర్శించారు.



తల్లిదండ్రుల వద్ద బోరున విలపిస్తున్న విద్యార్థినులు

జిల్లాకు 36 మంది ప్రొబేషనరీ ఎస్ఐలు

● ప్రజలతో సత్సంబంధాలుంటేనే కేసులు ఛేదించగలరన్న ఎస్పీ

తిరుపతి(నేరవిభాగం), జూలై 27(ఆంధ్రజ్యోతి): జిల్లాకు కొత్తగా 36మంది ప్రొబేషనరీ ఎస్ఐలు వచ్చారు. వీరిలో మహిళా ఎస్ఐలు 15 మంది ఉన్నారు. వీరితో అధికారం తిరుపతిలోని పోలీసు అతిథి గృహంలో ఎస్పీ హర్షవర్ధనరాజు సమావేశమయ్యారు. జిల్లాలోని వివిధ స్టేషన్లకు వారిని అలాట్ చేశారు. శిక్షణలో పొందిన అంశాలు, విధి నిర్వహణలో వచ్చే సవాళ్లు వేరుగా ఉంటాయని ఎస్పీ తెలిపారు. ఆ సవాళ్లను అధికమించి ముందుకు వెళ్ళి ప్రజలకు సత్వర న్యాయం అందించే బాధ్యత మనపై ఉందన్నారు. మనకు తెలిసినవన్నీ నిజాలు కావని, తెలియనివి అబద్ధాలు కావన్నారు. నిజా నిజాలు వెలికి తీసేలా దర్యాప్తు చేసి ఫిర్యాదుదారులకు న్యాయం చేయాలన్నారు. పోలీసు శాఖలో హోంగార్డు నుంచి ఉన్నతస్థాయి అధికారుల వరకు అందరూ ఒకటే ననే విషయం మరచి పోకూడదన్నారు. ప్రజలతో సంబంధాలు కలిగి ఉంటే ఎంతటి కేసునైనా ఛేదించవచ్చన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో టెక్నాలజీని అందిపుచ్చుకోవాలని ఆదేశించారు. దేశ వ్యాప్తంగా తిరుమల తిరుపతికి ఒక ప్రత్యేకత వుందని మీరు ఇక్కడకు వచ్చి విధులు నిర్వహించడం సంతోషంగా వుందన్నారు. విధి నిర్వహణలో అలసత్వం వహించినా, పొరబాట్లు చేసినా సహించే ప్రసక్తే లేదన్నారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ అడ్మిన్ వెంకట్రావు, ప్రొబేషనరీ ఎస్ఐలు పాల్గొన్నారు.



ప్రొబేషనరీ ఎస్ఐల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ

'శ్రీశైలం' నుంచి శ్రీవారి సన్నిధికి నీళ్లు

● రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు

తిరుమల, జూలై27(ఆంధ్రజ్యోతి): 'శ్రీశైలం రిజర్వాయర్ నుంచి కృష్ణమ్మ జలాలను తీసుకువచ్చి బాలాజీ రిజర్వాయర్లను నింపి, తిరుమల శ్రీవారి సన్నిధికి తీసుకువచ్చి భక్తులకు తాగునీటి అవసరాలను తీర్చనున్నాం. ఈ ప్రయత్నానికి శ్రీవారి ఆశీస్సులు ఉండాలని ప్రార్థించా'నని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్, కుటుంబ సభ్యులతో కలిసి మంత్రి నిమ్మల ఆదివారం శ్రీవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ.. గోవిందుడి ఆశీస్సులతో గత ఏడాది రిజర్వాయర్లన్నీ నిండి ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. గత 25 ఏళ్లలో లేనివిధంగా జూలై నెలలోనే శ్రీశైలం రిజర్వాయర్ నిండిందన్నారు. హంద్రీనీవా ద్వారా 3,850 క్యూసెక్కుల కృష్ణా జలాలను అడివిపల్లి రిజర్వాయర్ నింపి, నీవా కాలువ ద్వారా భవిష్యత్తులో తిరుపతికి తాగు, పారిశ్రామిక అవసరాలకు అందిస్తామన్నారు. శ్రీవారి ఆశీస్సులతో 2027 డిసెంబరు నాటికి పోలవరం ప్రాజెక్ట్ పూర్తిచేయాలనే లక్ష్యంతో ఉన్నామన్నారు. రాయలసీమను రత్నాలసీమగా మార్చేదిశగా తమ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. అమరావతి నిర్మాణం త్వరితగతిన పూర్తయితే విద్య, వైద్య, ఉపాధి అవకాశాలు కలగతాయన్నారు.



కామినేని శ్రీనివాస్, నిమ్మల రామానాయుడు

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

చోరీ సామగ్రి కొనుగోలు చేస్తే చర్యలు



పాత ఇనుప సామాను దుకాణాన్ని తనిఖీ చేస్తున్న డీఎస్పీ చెంచుబాబు, అర్బన్ సీఐ బాబి

నాయుడుపేట టౌన్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): చోరీ సామగ్రి కొనుగోలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు హెచ్చరించారు. పట్టణంలో ఉన్న పాత ఇనుప సామాన్ల దుకాణాలను డీఎస్పీ చెంచుబాబు ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం ఉదయం తనిఖీలు నిర్వహించారు. దుకాణాల్లో ఉన్న రాగి, ఇనుప వస్తువులను పరిశీలించారు. కొనుగోలు, అమ్మకాలకు సంబంధించిన బిల్లులను పరిశీలించారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ చోరీకి గురైన ఇనుము, ఇతర లోహ వస్తువుల అక్రమ వ్యాపారాన్ని అరికట్టేందు తనిఖీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. దుకాణ యజమానులకు భద్రతా చర్యలను పటిష్ఠం చేయాలని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అర్బన్ సీఐ బాబి, రూరల్ సీఐ సంఘమేశ్వరరావు, నాయుడుపేట, పెళ్లకూరు, ఓజిలి ఎస్ఐలు ఆదిలక్ష్మి, శ్రీకాంత్, నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ టోర్నీ విజేత అనంతపురం



టోర్నీ విన్నర్‌గా నిలిచిన అనంతపురం జట్టు

నాయుడుపేట, జూలై 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి అండర్-15 బాలికల రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో అనంతపురం జట్టు విజేతగా నిలిచింది. ఏపీ, తిరుపతి, నాయుడుపేట ఫుట్‌బాల్ అసోసియేషన్లు సంయుక్తంగా నిర్వహించిన రాష్ట్రస్థాయి టోర్నమెంట్ ఫైనల్స్ ఆదివారం జరిగింది. ఇందులో అనంతపురం జట్టు విజయం సాధించగా, కడప జట్టు రన్నర్‌గా నిలిచింది. కోచ్ షేక్ గౌస్‌బాషా, తిరుపతి ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి రెడ్డెప్ప టోర్నీని పర్యవేక్షించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ రఫీ, బిషప్ మైకెల్ బెన్‌హర్, మధు, ప్రసాద్, మాజీ కౌన్సిలర్ కళాచంద్, లక్ష్మయ్య, రాజీ, వినోద్, ఎలీషా, కోచ్‌లు రమేష్, వినోద్, అనిల్‌కుమార్, శ్రీనివాసరావు, ప్రసన్నకుమార్, సిరాజ్, ప్రమోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న డీఎస్పీ గీతాకుమారి

గూడూరు, జూలై 27 (ఆంధ్రజ్యోతి): రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని డీఎస్పీ గీతాకుమారి అన్నారు. ఆదివారం స్థానిక రూరల్ పోలీస్‌స్టేషన్ వద్ద పట్టణంలోని రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రౌడీషీటర్లు ప్రజాజీవనానికి విఘాతం కల్పిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పాత నేరస్థులు చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినా, ప్రోత్సహించినా, చట్టాలను అతిక్రమించి దౌర్జన్యానికి దిగినా ఉపేక్షించేదిలేదన్నారు. కార్యక్రమంలో సీఐ శేఖర్‌బాబు, ఎస్ఐలు మనోజ్‌కుమార్, తిరుపతయ్య, సుబ్రహ్మణ్యంరాజు తదితరులు పాల్గొన్నారు.

పేదల సమస్యల పరిష్కారమే సీపీఐ లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న హరినాథరెడ్డి

గూడూరు, జూలై 27 (ఆంధ్రజ్యోతి): పేదల సమస్యలను పరిష్కరించడమే సీపీఐ లక్ష్యమని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు హరినాధరెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక విశ్రాంత ఉద్యోగుల భవనంలో సీపీఐ నియోజకవర్గ స్థాయి మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోపిడీ వ్యవస్థ ఉన్నంత కాలం సీపీఐ అవసరం ఉంటుందన్నారు. పేదల అభ్యున్నతి కోసం ఎన్నో ఏళ్లుగా సీపీఐ అలుపెరుగని పోరాటాలు సాగిస్తోందన్నారు. ధరలను నియంత్రించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. కేంద్రప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాస్తూ కార్మికుల హక్కులను కాలరాస్తోందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం స్మార్ట్‌మీటర్ల పేరుతో పేదలపై విద్యుత్‌భారం మోపుతోందన్నారు. ముందుగా స్థానిక సీపీఐ కార్యాలయం నుంచి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి, ప్రభాకర్, చంద్రశేఖర్‌రెడ్డి, రాధాకృష్ణ, శశికుమార్, కాలేషా, సీవీఆర్ కుమార్, శ్రీనివాసమూర్తి, నారాయణ, రమేష్, మహేంద్ర, గోపి, ప్రసన్న, సునీల్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

గూడూరు, జూలై 27 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పారిశుధ్య కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బాలసుబ్రహ్మణ్యం అన్నారు. ఆదివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో సీఐటీయూ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మున్సిపల్ పారిశుధ్య కార్మికుల పనులను ప్రైవేటు కాంట్రాక్టర్లకు అప్పగించే యోచనను మానుకోవాలన్నారు. గత ప్రభుత్వంలో చేపట్టిన 17రోజుల సమ్మెకు సంబంధించిన ఒప్పందాలను అమలు చేయాలని కోరారుజ కార్యక్రమంలో శివకుమార్, రమేష్, మణెమ్మ, వెంకటరమణ, ఆనంద్, మురళి, శాంతివర్ధన్, బీవీ రమణయ్య, ప్రసాద్ పాల్గొన్నారు.



నాయుడుపేట మండలం బిరదవాడ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు కొండూరు సరస్వతి ఉద్యోగ విరమణ సన్మాన సభ ఆదివారం జరిగింది. సరస్వతి, ఆమె భర్త బాలు దంపతులను హెచ్‌ఎం శోభనాకుమారి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు సన్మానించారు.

బైక్‌ను ఢీకొన్న వ్యాన్
ఆర్టీసీ డ్రైవర్ దుర్మరణం



బాలరాజు (ఫైల్‌ఫొటో)

ఓజిలి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): బైక్‌ను మినీవ్యాన్ ఢీకొన్న ఘటనలో ఆర్టీసీ డ్రైవర్ దుర్మరణం చెందాడు. ఎస్ఐ శ్రీకాంత్ కథనం మేరకు... ఓజిలి మండలం చిల్లమానుచేనుకు చెందిన కొండూరు బాలరాజు(58) గూడూరు ఆర్టీసీ డిపోలో డ్రైవరుగా పనిచేస్తున్నాడు. ఆదివారం ఉదయం విధులకు వెళ్లేందుకు ద్విచక్ర వాహనంలో బయలుదేరాడు. పెద్దపరియ క్రాస్ రోడ్డు వద్ద జాతీయ రహదారిపై వెళుతుండగా తిరుపతి నుంచి కోదాడ వెళుతున్న మినీ వ్యాను వెనుక నుంచి వేగంగా ఢీకొంది. బాలరాజుకు తలపై బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడు బాలరాజుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

నేడు వెంకటగిరికి ఆర్టీసీ ఎండీ రాక

వెంకటగిరి టౌన్, జూలై 27(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఎండీ ద్వారక తిరుమలరావు సోమవారం ఉదయం 10గంటలకు వెంకటగిరి డిపోను సందర్శించనున్నట్లు మేనేజర్ రామకృష్ణ తెలిపారు.





వారం రోజుల క్రితం శ్మశాన స్థలం ఇలా ఉండేది - ప్రస్తుతం మట్టితోలిన ఆక్రమణదారులు

దాతలిచ్చిన స్థలాన్నీ వదల్లేదు!

- రూ.కోటి విలువైన శ్మశాన భూమి ఆక్రమణ
- మట్టితోలి చదును చేస్తున్న అక్రమార్కులు
- చోద్యం చూస్తున్న అధికారులు

సూళ్లూరుపేట, జూలై 27 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలో రూ.కోటి విలువ చేసే శ్మశాన స్థలాన్ని కబ్జా చేశారు. మట్టితోలి చదును చేసి ఇంటి ప్లాట్‌గా మార్చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. సూళ్లూరుపేట మండలం కేసియన్‌గుంట పంచాయతీ డేగలపాలెం గ్రామానికి శ్మశానం లేకపోవడంతో 2002లో కందలగడ్డల విజయలక్ష్మి ముందుకొచ్చారు. కుదిరి చెరువు సమీపంలో ఉల్పాపడవ రోడ్డుకు వెళ్లే మార్గంలో సర్వే నెంబరు 123-1లో 10 సెంట్ల భూమిని దానం చేశారు. నిబంధనల మేరకు రిజిస్ట్రేషన్ చేసి పంచాయతీకి అందజేశారు. ఈ స్థలాన్ని కస్వారెడ్డిపాలెం, డేగలపాలెం గ్రామస్థులు కొన్నాళ్లు శ్మశానంగా వాడుకొన్నారు. 2021లో కేసియన్‌గుంట పంచాయతీలో ఉన్న డేగలపాలెం గ్రామాన్ని మున్సిపాలిటీలో విలీనం చేశారు. కాలక్రమేణా శ్మశానం చుట్టూ వెంచర్లు రావడంతో ఆ ప్రాంతంలో భూములకు గిరాకీ పెరిగింది. పుట్టగొడుగుల్లా వెంచర్లు వెలిశాయి. శ్మశానం పక్కన వరకు ఇళ్ల నిర్మాణాలు సాగాయి. శ్మశాన స్థలం ఖాళీగా ఉండడంతో వైసీపీ హయాంలో అక్రమార్కుల కన్నుపడింది. అప్పట్లో గ్రామస్థులు రెవెన్యూ అధికారులకు దృష్టికి తీసుకెళ్లడంతో చుట్టూ రాళ్లునాటి ముళ్లకంచే వేశారు. ప్రస్తుతం శ్మశానం పక్కన ఉన్న ప్లాట్ల యజమానులు కంచెను తొలిగించి స్థలాన్ని ఆక్రమించారు. మట్టి తోలి చదును వేస్తున్నారు. రూ.కోటి విలువ చేసే శ్మశాన స్థలాన్ని ఆక్రమించుకుని ప్లాట్‌గా మార్చుకుని చదునుచేసే పనిలో ఉన్నా మున్సిపాలిటీ, రెవెన్యూ అధికారులు పట్టించుకోకుండా చోద్యం చూస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి దాతలు శ్మశానికి ఇచ్చిన స్థలాన్ని ఆక్రమణదారుల నుంచి కాపాడాల్సిన అవసరం ఉంది.

రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు: విజయశ్రీ



కరపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ

తడ, జూలై 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సంక్షేమంతో పాటు అభివృద్ధి పరుగులు పెడుతోందని సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని తడకండ్రిగ, గ్రద్దగుంట గ్రామాల్లో సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను అందజేసి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. గ్రద్దగుంట పంచాయతీలో రూ.25 లక్షల వ్యయంతో నిర్మించిన సిమెంట్ రోడ్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో అభివృద్ధి జాడ లేదని, అధ్వానమైన రోడ్లపై జనం నరకయాతన అనుభవించారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి గానే రోడ్లు, మురుగు కాలువలకు మోక్షం లభించిందన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీలను అమలు చేస్తున్నామని, ఆగస్టు 15నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకం అమలులోకి రానుందన్నారు. కాగా, ఆయా గ్రామాల్లో ఎమ్మెల్యే నెలవల విజయశ్రీని పూలవర్షంతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శేఖర్‌నాయక్, టీడీపీ మండల అధ్యక్షుడు కామిరెడ్డి మురళీరెడ్డి, నాయకులు నీలకంఠం, బొమ్మన శ్రీధర్, సుదర్శన్, జీవ, జయపాల్, వేలూరు చంద్రయ్య, వేనాటి రాజారెడ్డి, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

సంగమేశ్వరాలయంలో కుంభాభిషేకం

కోట, జూలై 27 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గూడలిలో గల కామాక్షీదేవి సమేత సంగమేశ్వరాలయంలో కుంబాభిషేకం జరిగింది. అమ్మవారి సకల కలలను కలశములోకి ఆవాహన చేసి అమ్మవారి విగ్రహానికి స్థానచలం చేశారు. సోమవారం నుంచి కుంబాభిషేకాలు పూర్తి అయ్యేవరకు అమ్మవారి ఆలయాన్ని పూర్తిగా మూసివేస్తామని ప్రధానార్చకుడు కార్తీక్‌శర్మ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఈవో శశాంక్, టీడీపీ నాయకులు వెంకటకృష్ణారెడ్డి, వీరరాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కారును ఢీకొన్న లారీ

చిల్లకూరు, జూలై 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వరగలి క్రాస్‌రోడ్డు సమీపంలో ఆదివారం కారును లారీ ఢీకొంది. పోలీసుల వివరాల మేరకు... నెల్లూరు నుంచి చెన్నై వెళుతున్న కారును అధిగమించే క్రమంలో లారీ అదుపు తప్పి ఢీకొంది. ఈ ఘటనలో కారు స్వల్పంగా దెబ్బతింది. కారులో ప్రయాణిస్తున్న వారికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మెరైన్ పోలీస్ స్టేషన్‌లో డీఐజీ తనిఖీలు



మెరైన్ పోలీసు స్టేషన్‌ను పరిశీలిస్తున్న డీఐజీ గోపీనాథ్‌జెట్టి

వాకాడు, జూలై 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దుగరాజపట్నం మెరైన్ పోలీసు స్టేషన్‌ను ఆదివారం డీఐజీ గోపీనాథ్‌జెట్టి పరిశీలించారు. రికార్డులను పరిశీలించారు. తీరంలో భద్రత, నిఘా గురించి ఆరా తీశారు. మెరైన్ సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. తీరంలో భద్రత కోసం కోస్టల్ సేవలు విస్తృత పరిచేందుకు ప్రయత్నిస్తున్నామని డీఐజీ గోపీనాథ్‌జెట్టి చెప్పారు. కార్యక్రమంలో సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐలు అంజిరెడ్డి, సౌమ్య, ఏఎస్ఐ నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో పంచాయతీ కార్యదర్శి మృతి



యాశ్మిన్ (ఫైల్‌ఫొటో)

పెళ్లకూరు, జూలై 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని బంగారంపేట పంచాయతీ కార్యదర్శి ఎండీ యాశ్మిన్ (45) అనారోగ్యంతో ఆదివారం ఉదయం మృతి చెందారు. ఆమె మృతదేహానికి టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వేలూరు మురళీకృష్ణారెడ్డి, పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర కార్యదర్శి, బంగారుపేట పంచాయతీ సర్పంచు దేవారెడ్డి నాగేంద్ర ప్రసాద్ రెడ్డి, శిరసనసంబేడు ఉప సర్పంచు శిరసనంబేటి సురేష్‌రెడ్డితో పాటు సహచర ఉద్యోగులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నేడు పీఎఫ్‌పై అవగాహన సదస్సు

నెల్లూరు(వెంకటేశ్వరపురం), జూలై 27 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల భవిష్య నిధి(పీఎఫ్)కి సంబంధించిన సమస్యల పరిష్కారం కోసం సోమవారం తడ, మంబట్టు ప్రాంతాల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు జిల్లా పీఎఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి కృష్ణారావు తెలిపారు. తడ, మంబట్టు ప్రాంతాల్లోని అపాచీ ఫుట్వేర్ పరిశ్రమ వద్ద నిధి ఆప్కే నికట్-2 కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు చెప్పారు. పీఎఫ్ కలిగిన ఉద్యోగులు, కార్మికులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రోటరీక్లబ్ ఎన్నికలు ఏకగ్రీవం



మధుయాదవ్‌ను అభినందిస్తున్న జలీల్ అహ్మద్, మునిగిరీష్

కోట, జూలై 27 (ఆంధ్రజ్యోతి): కోటలోని పెన్షనర్స్ కార్యాలయంలో ఆదివారం కోట టౌన్ రోటరీ క్లబ్ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. రోటరీక్లబ్ గవర్నర్ మునిగిరీష్ పర్యవేక్షణలో ఎన్నికలు నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడిగా జలీల్ అహ్మద్, కార్యదర్శిగా ఏవీ సుబ్రహ్మణ్యం, జాయింట్ సెక్రటరీగా పవన్‌కుమార్, కోశాధికారిగా మోహన్‌వంశీ, సభ్యులుగా షంషుద్దీన్, మోబీన్, పసుపులేటి కిషోర్, జెన్ని ప్రసాద్, గోపాల్‌రెడ్డి, మధుయాదవ్, కృష్ణమూర్తి, నెల్లూరు మోహన్‌రెడ్డి, రవివర్మ, డిస్టిక్ గవర్నర్‌గా ఎంకే రవీంద్ర ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరందరినీ టీడీపీ నాయకులు అభినందించారు.

ఉరేసుకుని యువతి ఆత్మహత్య

తడ,జూలై 27(ఆంధ్రజ్యోతి): ఉరేసుకుని ఓ యువతి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన తడలో చోటుచేసుకుంది. శ్రీకాకుళం జిల్లా పలాసకు చెందిన పూజిత(22) శ్రీసిటీలోని ఓ పరిశ్రమలో పని చేస్తూ తడలో ఉంటోంది. ఆదివారం సాయంత్రం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆమె స్నేహితుడు సత్యవేడుకు చెందిన ఆనంద్ రాత్రి ఇంటికి తలుపు తట్టి పిలిచినా స్పందించకపోవడంతో కిటికీలో నుంచి చూడగా పూజిత ఉరేసుకుని ఉండడం గమనించాడు. చుట్టు పక్కల వారి సాయంతో తలుపులు పగలగొట్టి ఆమెను కిందకు దించారు. అప్పటికే మృతి చెంది ఉండడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తిత్వ వికాసంపై ప్రేరణ తరగతులు

కోట, జూలై 27 (ఆంధ్రజ్యోతి): కోటలోని జ్యోతిబా పూలే బీసీ బాలుర గురుకులంలో ఆదివారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులకు ప్రేరణ తరగతులు జరిగాయి. ప్రముఖ సైకాలజిస్టు కర్లపూడి కృష్ణ వ్యక్తిత్వ, మానసిక వికాసంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ నారాయణరావు, జేవీవీ నాయకులు బాలకృష్ణారెడ్డి, వేణుగోపాల్, రాజేంద్ర పాల్గొన్నారు.

సింగపూర్‌లో సీఎం చంద్రబాబుకు చిల్లకూరువాసుల స్వాగతం

చిల్లకూరు, జూలై 27 (ఆంధ్రజ్యోతి): సింగపూర్ పర్యటనకు వెళ్లిన సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్‌కు చిల్లకూరు మండలం కమ్మవారిపాళెం గ్రామానికి చెందిన నవీన్‌కుమార్, హిమబిందు స్వాగతం పలికారు. సింగపూర్‌లో నివసిస్తున్న వీరు అక్కడ టీడీపీ కార్యక్రమాలు నిర్వహిస్తూ క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు.

గునపాడులో రక్తదాన శిబిరం

చిట్టమూరు, జులై27(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గునపాడు ఉన్నత పాఠశాలలో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఎంఈవో నసీం ఆలీ, రెడ్‌క్రాస్ పీఆర్వో మధుసుదనరావు, కందాటి రామిశెట్టి, హరికృష్ణ, అన్సర్, వినీల్, రమేష్, నాగూరయ్య, మల్లికార్జున్, సురేంద్ర, నారాయణ రావు, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకే కార్డన్ సెర్చ్

గూడూరు, జూలై 27 (ఆంధ్రజ్యోతి): నేరాలను నియంత్రించేందుకు కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నామని పట్టణ సీఐ శేఖర్‌బాబు అన్నారు. ఆదివారం స్థానిక రాణిపేటలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. పలు ఇళ్లను తనిఖీ చేసి సరైన ధృవీకరణ పత్రాలు లేని 18 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తుంటే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఈ తనిఖీల్లో ఎస్ఐలు మనోజ్‌కుమార్, తిరుపతయ్య, సురేష్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

సమన్వయంతో అభివృద్ధి చేద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ ధనలక్ష్మి

నాయుడుపేట, జూలై 27(ఆంధ్రజ్యోతి): ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతో మండలాన్ని అభివృద్ధి చేద్దామని ఎంపీపీ కురుగొండ ధనలక్ష్మి అన్నారు. నాయుడుపేట మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం ఎంపీడీవో సురేష్‌బాబు ఆధ్వర్యంలో సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. వర్షాల దృష్ట్యా అంటువ్యాధులు ప్రబలకుండా పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. దోమలు వృద్ధి చెందకుండా తగు చర్యలు తీసుకోవాలని, ఎప్పటికప్పుడు బ్లీచింగ్ వేయాలన్నారు. తాగునీటి పథకాలను పర్యవేక్షించి అవసరమైన చోట్ల మరమ్మతులు చేపట్టాలన్నారు. సమావేశంలో జడ్పీటీసీ కట్టా జ్యోతిరెడ్డి, తహసీల్దారు రాజేంద్రప్రసాద్, ప్రజాప్రతినిధులు, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మకు విశేష పూజలు

చిల్లకూరు, జూలై 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పు కనుపూరులో వెలసిన ముత్యాలమ్మకు ఆదివారం విశేష పూజలు జరిగాయి. భక్తులు ఆలయం వద్ద పొంగళ్లు పెట్టుకుని నైవేద్యం నివేదించి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయం ఎదుట ఉన్న త్రిశూలం వద్ద టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.

పేద విద్యార్థులకు సాయం

కోట, జూలై 27(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి నెల్లూరు జిల్లాలో పరిధిలో ప్రతిభ చూపిన కలిగిన పేద విద్యార్థులకు ఆదివారం కోటలోని కోటమ్మ ఆలయ ప్రాంగణంలో నగదు పురస్కారాలు అందజేశారు. పదో తరగతి చదువుతున్న 40మంది విద్యార్థులకు రూ.5వేలు, బీటెక్ చదువుతున్న 20 మందికి రూ.10వేల చొప్పున చెక్కులు అందించారు. కార్యక్రమంలో షిరిడీసాయి అక్షయ సేవాసమితి కన్వీనర్ అల్లం రమణయ్య, వెంకటరమణారెడ్డి, ఆవుల సుబ్బయ్య, బాబురావు, నరేష్, టీడీపీ నాయకులు నల్లపరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

సన్మానం

నాయుడుపేట, జూలై 27 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో ఆదివారం ప్రపంచ ఆర్యవైశ్య మహాసభలను ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు జక్కా సుబ్బరాజు అధ్యక్షతన నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం కార్యక్రమాలలో కీలకపాత్ర పోషిస్తున్న జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు గూడూరు కిషోర్‌కుమార్, లక్ష్మి దంపతులను సత్కరించారు.

సీఎం చంద్రబాబుతోనే సంక్షేమం



పునబాకలో కరపత్రాలను అందజేస్తున్న సంచి కృష్ణయ్య

పెళ్లకూరు, జూలై 27 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబునాయుడుతోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమవుతుందని టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని చెంబేడు, పునబాక గ్రామాల్లో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నేలవల్లి సిద్దులయ్యానాయుడు, వేలూరు హరి నాయుడు, తాళ్ల యుగంధర్‌గౌడ్, మల్లిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహనీయుడు ఎన్టీఆర్

- జిల్లా ఇన్‌చార్జి మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి
- ఒరూరుపేటలో 'అన్న' విగ్రహావిష్కరణ



ఎన్టీఆర్ విగ్రహావిష్కరణలో మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి, ఎంపీ ప్రసాదరావు, ఎమ్మెల్యే భానుప్రకాష్, గంధమనేని రాజేష్, టీడీపీ నాయకులు

నింద్ర, జూలై 27 (ఆంధ్రజ్యోతి): తెలుగు జాతి ఖ్యాతిని ప్రపంచం నలుమూలలకు చాటి చెప్పిన మహనీయుడు, టీడీపీ వ్యవస్థాపకుడు స్వర్గీయ నందమూరి తారక రామారావు (ఎన్టీఆర్) అని జిల్లా ఇన్‌చార్జి మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా టీడీపీ మాజీ అధ్యక్షుడు, స్వర్గీయ గంధమనేని రమేష్ చంద్రప్రసాద్ కోరిక మేరకు ఆయన ప్రథమ వర్ధంతి సందర్భంగా తనయుడు రాజేష్.. నింద్ర మండలంలోని ఒరూరుపేటలో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆదివారం ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్, టీడీపీ నాయకులతో కలిసి మంత్రి ఆవిష్కరించారు. అనంతరం జరిగిన మీడియా సమావేశంలో మంత్రి ప్రసంగించారు. పేదవాడికి కిలో రెండు రూపాయల బియ్యం అందించిన ఘనత అన్న ఎన్టీఆర్‌కే దక్కిందన్నారు.

వైసీపీ వారికి తెలిసిందే స్కామ్‌లే..!

వైసీపీ వారికి స్కామ్‌లు తప్ప సంక్షేమం అంటే ఎలా తెలుస్తుందని రామ్‌ప్రసాద్‌రెడ్డి ఎద్దేవా చేశారు. వైసీపీ పాలనలో 'ఆడుదాం ఆంధ్ర'లోనే కాదు అనేక సంక్షేమ పథకాల్లోనూ స్కామ్‌లు చేశారని విమర్శించారు. స్కామ్‌లు చేసిన ప్రతి ఒక్కరి పేరు బయటకు చెప్పాలని ఉంది కానీ.. దీనిపై అసెంబ్లీ కమిటీ వేశామని వారిచ్చే రిపోర్టు 10, 15 రోజుల్లో బయటకు వస్తుందన్నారు. ఎవరైతే దోషులుగా ఉంటారో వారికి శిక్ష తప్పదన్నారు. ఇది రాజకీయ కక్ష కాదని.. చట్టం తన పని తాను చేసుకుపోతుందన్నారు. రమేష్ చంద్రప్రసాద్ తనయుడు గంధమనేని రాజేష్ మాట్లాడుతూ.. తెలుగువారి ఆత్మగౌరవం కోసం తెలుగుదేశం పార్టీని స్థాపించిన ఎన్టీఆర్ ప్రధానమంత్రి స్థాయికి పోటీ పడటం తెలుగుజాతికి గర్వకారణమని అన్నారు. అంతకుముందు రమేష్ చంద్రప్రసాద్ చిత్రపటం వద్ద నాయకులు నివాళి అర్పించారు. ఈ కార్యక్రమాల్లో చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు సీఆర్ రాజన్, మాజీ ఎమ్మెల్సీలు దొరబాబు, గౌనివారి శ్రీనివాసులు, శాప్ చైర్మన్ రవినాయుడు, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, తిరుపతి కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ మునికృష్ణ, పార్లమెంట్ పార్టీ అధికార ప్రతినిధి చినబాబు, మండల పార్టీ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, నాయకులు దశరథవాసు, రవినాయుడు, వెంకటేశ్వరనాయుడు, గంగాధర్‌నాయుడు, గాలి రమేష్‌నాయుడు, తదితరులు పాల్గొన్నారు.